ANDHRAJYOTHY

# ఆంధ్రజ్యోతి

బాపట్ల జిల్లా వార్తలు

5

శనివారం 8 మార్చి 2025





# అన్నింటా.. ఆమె

ఆమె.. ఇంటితో పాటు పాలనా వ్యవహారాలను, సమాజాన్ని, పరిశ్రమలను చక్కదిద్దుతున్నది. కుటుంబ బాగోగులు ఏ విధంగా అయితే చూసుకుంటారో అదే రీతిన సమాజాన్ని, విధివంచితులను ఆదుకునేందుకు ముందడుగు వేస్తున్నారు. సేవారంగంలోనూ, పారిశ్రామికవేత్తలుగా రాణిస్తూ ఎందరికో స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు. అపరిమితమైన ప్రేమను సేవాభావంతో సాటి మహిళలకు, సమాజానికి పంచుతున్నారు. ఒకప్పుడు వంటింటికే పరిమితమై కేవలం గృహిణిగానే మిగిలిపోయిన సగటు మహిళ నేడు ఆకాశమే హద్దుగా దూసుకు పోతోంది. ఆకాశంలో సగమైన ఆధునిక మహిళ అన్ని రంగాల్లో తన సత్తా చాటడమే కాదు.. అనేక రంగాల్లో తనదైన ముద్ర వేస్తోంది. ఒకప్పుడు వంటిట్లో గరిటతో సహవాసం చేసిన మహిళ సేవారంగంలో అమ్మగా.. రాజకీయాల్లో రాజసంగా.. పాలనలో పథగామిగా.. పోరాటంలో వీరవనితగా.. ముందడుగు వేస్తోంది. అబల అంటూ సమాజం తనపైన వేసిన ముద్రను చెరిపేస్తూ తన 'సబల'త్వాన్ని ప్రపంచానికి చాటి చెబుతోంది. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలో స్ఫూర్తి దాయకంగా ఎందరో మహిళలు ఉన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్ఫూర్తిదాయక మహిళల్లో కొందరు గురించి ఆంధ్రజ్యోతి పాఠకుల కోసం..

8

అమరావతి రాజధాని కలిగిన కీలకమైన గుంటూరు జిల్లా బాధ్యతలను మహిళా అధికారులైతేనే సమర్థవంతంగా నిర్వహిస్తారన్న భావనతో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వమ్ము చేయకుండా పాలన, అభివృద్ధి అంశాల్లో రాణిస్తున్నారు. రాజకీయ చైతన్యానికి మారుపేరుగా నిలిచిన ఉమ్మడి గుంటూరు జిల్లాలో అటు రాజకీయ నాయకులు, ఇటు ప్రజలు, మరోవైపు ఉద్యోగులను సమన్వయం చేసుకుంటూ కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. గుంటూరు జిల్లాలో కీలకమైన 16 ప్రభుత్వ శాఖలకు మహిళలే నాయకత్వం వహిస్తున్నారు.

నవ్యాంధ్ర కలల రాజధాని అమరావతి ఆయువు తీసేందుకు గత ప్రభుత్వం ప్రయత్నించగా గ్రామీణ మహిళలు కులమతాలకు అతీతంగా రోడ్డెక్కి చేసిన పోరాటం దేశాన్నే ఆశ్చర్యపరిచింది. ప్రభుత్వ కుట్రలను ధీరోదాత్తంగా ఎదుర్కొని అమరావతి సమరావతిగా మారింది.. అబలలుగా ముద్రపడిన మహిళలు సబలలుగా మారి ఐదేళ్లపాటు పోరాటం చేసి అమరావతిని అజరామరం చేశారు.

చిన్న వయసులోనే హెచ్ఐవీతో భర్తను కోల్పోయి.. అయినవాళ్ల అవమానాలతో కుంగిపోకుండా తనలా మారిన ఎందరో బాధితులను అక్కున చేర్చుకున్న సగటు మహిళ.. ఆదర్శ మహిళగా షిప్ సంస్థ వ్యవస్థాపకురాలు గుంటూరుకు చెందిన రమాదేవి నిలిచారు.

- సేవ నుంచి సమరం వరకు సబలలు
- ఎందరికో స్ఫూర్తిగా మారి అద్భుతాలు సృష్టి
- అమరావతి ఉద్యమంలో ఉద్భవించిన వీరమాతలు
- సంక్రమణ వ్యాధుల పనిపట్టేలా డాక్టర్ శారద కృషి
- ఆక్వా పరిశ్రమలో ఆదర్శప్రాయంగా అనంత విజయ
- షిప్ సంస్థ ద్వారా హెచ్ఐవీ బాధితులకు బాసటగా రమాదేవి
- మదర్ థెరిస్సా స్ఫూర్తితో అనాథ పిల్లల సేవలో డాక్టర్ మంగాదేవి
- అధికారి నుంచి ప్రజాప్రతినిధుల వరకు కీలక బాధ్యతలు

బాపట్లలోని బెస్తపాలెం నుంచి ఆక్వా రంగంలో అత్యున్నత శిఖరాలు అందుకున్న మత్స్యకార మహిళ అనంత విజయ అవార్డులతో పాటు ప్రముఖుల నుంచి ప్రశంసలు అందుకుంటున్నారు. మహిళలను నిర్లక్ష్యం చేయకుండా ప్రోత్సహిస్తే ఉన్నతంగా రాణిస్తారని అనంత విజయ నిరూపించారు.



మహిళలకు అవగాహన కల్పిస్తున్న శారద

చిన్నారుల కోసం మంచి పాఠశాల నిర్వహిస్తున్నారు కదా.. అనాథల పిల్లల కోసం కూడా ఏదైనా చేయగలరేమో.. ఆలోచించండి అన్న మదర్‌థెరిస్సా మాటలతో చేతన సంస్థను ఏర్పాటు చేసి కొండరాళ్లు కొట్టి పొట్ట పోసుకుంటున్న కుటుంబాల పిల్లలను ఇంజనీర్లు, డాక్టర్లుగా డాక్టర్ మంగాదేవి మార్చారు. వందల మంది విద్యార్థులను అక్కున చేర్చుకుని విద్యాబుద్ధులు చెప్పే దేవాలయంగా చేతన పాఠశాలను మార్చారు.

డాక్టర్‌గా నాలుగు గోడల మధ్య వైద్యం అందించడానికి పరిమితం కాకుండా సాటి మహిళల కష్టాలు తీరుస్తూ తెనాలికి చెందిన డాక్టర్ శారద మేటి మహిళగా నిలిచారు. సాటి మహిళల కోసం తన వంతుగా సేవ చేసే అవకాశం దక్కడాన్ని డాక్టర్ శారద గర్వంగా భావిస్తున్నారు.

# 15న శ్రీవారి కల్యాణోత్సవం

- వెంకటపాలెంలో హాజరుకానున్న సీఎం చంద్రబాబునాయుడు
- ఏర్పాట్లపై అధికారులతో చర్చించిన టీటీడీ ఈవో శ్యామలరావు



శ్రీవారి ధర్మ ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న ఈవో శ్యామలరావు

తుళ్లూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): రాజధాని గ్రామం వెంకటపాలెంలోని టీటీడీ ఆధ్వర్యంలో వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారి కల్యాణోత్సవం ఈ నెల 15న జరగనుంది. సీఎం చంద్రబాబు ఈ కల్యాణోత్సవానికి కార్యక్రమానికి హాజరు కానున్నారు. ఆలయం ముందున్న ఆవరణలో కల్యాణోత్సవం చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలో కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్‌కుమార్‌తో శుక్రవారం తిరుమల తిరుపతి దేవస్థాన ఈవో శ్యామలరావు చర్చించారు. కల్యాణానికి 20 వేల మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నట్లు ఈవో శ్యామలరావు విలేకర్లకు చెప్పారు. భక్తులకు తాగునీరు, అన్న ప్రసాదాలు అందజేస్తామని తెలిపారు. హిందూ ధర్మ ప్రచార పరిషత్ అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహిస్తామన్నారు. కల్యాణం సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు జరుగుతుందని తెలిపారు. ఆలయ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం శ్రీవారి ధర్మ ప్రచార రథాన్ని ఈవో శ్యామలరావు జెండా ఊపి ప్రారంభించారు. శ్రీవారి ధర్మ రథాల ద్వారా రాజధానిలో ప్రచారం ప్రారంభించినట్లు చెప్పారు. కల్యాణోత్సవానికి ముఖ్యమంత్రి హాజరుకానున్న నేపథ్యంలో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. దేవాలయం వద్ద చేయాల్సిన ఏర్పాట్ల శుక్రవారం కలెక్టర్, ఎస్పీ అధికారులతో సమీక్షించారు. వీవీఐపీ, వీఐపీల రాకపోకల మార్గాలను, కల్యాణోత్సవ వేదిక, భక్తులు ఆశీనులయ్యే ప్రాంగణం, పార్కింగ్ ప్రాంతాలను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో దేవదాయశాఖ కార్యదర్శి వినయ్‌చంద్, డీఎస్పీ మురళీ కృష్ణ, సీఐ గంగా వెంకటేశ్వర్లు ఆర్డీఏవో శ్రీనివాసరావు, సీఆర్డీఏ, రెవెన్యూ అధికారులు, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.




వెంకటేశ్వరుడి కల్యాణోత్సవ ప్రతులను ఆవిష్కరిస్తున్న ఈవో శ్యామలరావు, కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్ కుమార్

## కేంద్రీయ విద్యాలయాల్లో ప్రవేశానికి వేళాయె

- ఉమ్మడి జిల్లాలో ఐదు విద్యాలయాలు
- బాలవాటిక (నర్సరీ) నుంచి 11వ తరగతి వరకు..
- ఈ నెల 21 అడ్మిషన్లకు చివరి తేదీ

6

## రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.22 (శనివారం)
సహరి : 5.04 (ఆదివారం)

# మున్సిపాలిటీలకు.. షాక్



| మునిసిపాల్టీ | నిధుల విడుదల |
|---|---|
| గుంటూరు | 24,25,85,000 |
| తెనాలి | 5,25,92,000 |
| చిలకలూరిపేట | 4,73,72,000 |
| మాచర్ల | 2,05,58,000 |
| సత్తెనపల్లి | 1,94,45,000 |
| వినుకొండ | 2,05,92,000 |
| పిడుగురాళ్ల | 2,22,47,000 |
| చీరాల | 2,82,01,000 |
| దాచేపల్లి | 1,61,85,000 |
| గురజాల | 1,18,03,000 |

- ఆర్థిక సంఘం నిధులు నిలిపివేత
- ఎన్నికలు నిర్వహిస్తేనే నిధులని తేల్చేసిన కేంద్రం
- రూ.కోట్లలో నిధులను కోల్పోయిన ఏడు పురపాలక సంఘాలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఎన్నికలు నిర్వహించని, ఆస్తి పన్ను అసెస్మెంట్లలో ప్రగతిలేని మున్సిపాల్టీలకు కేంద్ర ప్రభుత్వం షాక్ ఇచ్చింది. 15వ ఆర్థిక సంఘం నిధులు నిలిపివేసింది. పాలకవర్గం లేదనే కారణంతో నరసరావుపేట, బాపట్ల, పొన్నూరు, మంగళగిరి, తాడేపల్లి, రేపల్లె, అద్దంకి మున్సిపాల్టీలు పెద్దఎత్తున నిధులను కోల్పోయాయి. ఆర్థిక సంఘం నిధులే ప్రధాన ఆదాయ వనరైనా ఆ నిధులు లేక పోవడంతో ఆయా పురపాలక సంఘాల్లో ప్రగతి ప్రశ్నార్థకంగా మారింది. స్థానిక సంస్థలను బలోపేతం చేయడంతో పాటు ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పన కోసం ఏటా కేంద్ర ప్రభుత్వం నిధులను విడుదల చేస్తోంది. అయితే పాలకవర్గాలు, ఆస్తి పన్ను అసెస్మెంట్ల పురోగతి ఉంటేనే నిధులు విడుదల చేయాలన్న నిబంధనను కేంద్రం విధించింది. దీంతో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో ఎన్నికలు నిర్వహించని ఫలితంగా ఏడు మున్సిపాలిటీలకు నిధులు నిలిచిపోయాయి. 2023-24 ఆర్థికం సంవత్సరం రెండో విడతలో గుంటూరు కార్పొరేషన్ సహా తొమ్మిది మున్సిపాల్టీలకు రూ.48.10 కోట్లను కేంద్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసింది. అయితే పాలకవర్గాలు లేని నరసరావుపేట, బాపట్ల, పొన్నూరు, మంగళగిరి, తాడేపల్లి మున్సిపాల్టీలకు, ఆస్తి పన్ను అసెస్మెంట్లలో ప్రగతి లేని రేపల్లె, అద్దంకి మున్సిపాల్టీలకు ఆర్థిక సంఘం నిధులను కేంద్రం నిలిపివేసింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో మొదటి విడతగా అక్టోబరు, రెండో విడతగా ఫిబ్రవరిలో కేంద్రం నిధులు విడుదల చేసింది. అయితే ఈ ఏడు మున్సిపాల్టీలకు మాత్రం నిధులు జమ కాలేదు. నరసరావుపేటకు పొరుగున ఉన్న చిలకలూరిపేట మున్సిపాల్టీకి తాజాగా రూ.4.73 కోట్లు నిధులు విడుదలయ్యాయి. ఇదే స్థాయిలో నరసరావుపేట సహా మిగిలిన మున్సిపాల్టీకి నిధులు సమకూరే వీలుండేది. ఆయా నిధులు సమకూరి ఉంటే పట్టణాల్లో చాలా వరకు రహదారులు, డ్రెయిన్లు, ఇతర మౌలిక వసతుల కల్పన చేపట్టే అవకాశం ఉండేది. పాలకవర్గం లేదనే కారణంతో ఇప్పుడు ఈ నిధులు నిలిపేయడంతో వాటి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఆర్థిక సంఘం నిధులు నిలిపివేయడంతో ఎన్నికల నిర్వహణ అనివార్యమైంది. ప్రభుత్వం ఎన్నికలు నిర్వహిస్తేనే ఆయా మున్సిపాలిటీల్లో ప్రగతి ముందడుగు వేసే అవకాశం ఉంటుంది.

### ఆ మున్సిపాల్టీల్లో విచిత్ర పరిస్థితి

ఆర్థిక సంఘం నిధుల విడుదలకు ఉన్న నిబంధనల్లో పాలకవర్గాలు ఒకటైతే.. పురపాలక సంఘాల్లో ఉన్న అసెస్మెంట్ల పెరుగుదల కూడా మరో నిబంధన. ఏటా ఉన్న అసెస్మెంట్లలో 15 శాతం వృద్ధి ఉండాలి. అయితే రేపల్లె, అద్దంకి మున్సిపాల్టీల్లో ఏటా అసెస్మెంట్ల వృద్ధి తక్కువగా ఉంది. దీంతో కేంద్రం ఈ మున్సిపాలిటీలకు రెండు విడతలుగా ఆర్థిక సంఘం నిధులను నిలిపేసింది.

### వార్డుల పునర్విభజన తకరారు..

గతంలో నరసరావుపేట, బాపట్ల, పొన్నూరు మున్సిపాల్టీల్లో పొరుగున ఉన్న పంచాయతీ లను విలీనం చేసి వార్డుల సంఖ్యను పెంచారు. ఈ ప్రక్రియలో అధికారులపై ఒత్తిడి తెచ్చి వైసీపీ నేతలు వారికి అనుకూలంగా వార్డుల పునర్విభజన చేయించారు. వార్డుల విభజన సక్రమంగా జరగలేదని అభ్యంతరాలు వచ్చినా అధికారులు లక్ష్యపెట్టలేదు. ఫలితంగా బాధితులు కొందరు కోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో ఆయా మున్సిపాల్టీల్లో ఎన్నికలు నిలిచిపోయాయి. మంగళగిరి.. తాడేపల్లి మున్సిపాల్టీలను విలీనం చేసి గ్రేటర్ మంగళగిరిగా వైసీపీ ప్రభుత్వం మార్పు చేసింది. ఈ ప్రక్రియలో జరిగిన జాప్యం కారణంగా ఈ రెండు మున్సిపాల్టీలకు ఎన్నికలు నిర్వహించలేదు. ఇప్పటికీ ఎన్నికలు నిర్వహించడంలో రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవడంలేదు. దీంతో ఇప్పటికే ఈ మున్సిపాలిటీలకు రెండు విడతల్లో ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయాయి. ఎన్నికలు జరిగి పాలక వర్గాలు కొలువు దీరే వరకు ఆయా పురపాలక సంఘాలు ఆర్థిక సంఘం నిధులు కోల్పోనున్నాయి.

# నాడు అరాచకాలు.. నేడు అక్రమాలు

హైకోర్టును బురిడీకొట్టించిన వ్యవహారంతో కలకలం



- అజ్ఞాతంలో బోరుగడ్డ.. ఇంటికి తాళాలు.. సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్
- బెయిల్‌పై బయటవచ్చిన తర్వాత నకిలీ సర్టిఫికెట్ వెలుగులోకి ..

గుంటూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): నాడు అరాచకాలతో బెంబేలెత్తించిన రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్.. నేడు అక్రమాలకు తెరలేపాడు. ప్రభుత్వం ఏదైనా.. అధికారంలో ఎవరున్నా సరే తగ్గేదేలేదంటున్నాడు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు అడ్డగోలుగా ప్రవర్తించిన బోరుగడ్డ ఆ తర్వాత కూడా తన నేర ప్రవృత్తిని కొనసాగిస్తూనే ఉన్నాడనేందుకు అనేక సంఘటనలు వెలుగుచూశాయి. పోలీస్‌స్టేషన్‌లో రాచమర్యాదలైనా.. కస్టడీలో పోలీసులతో కలసి రెస్టారెంట్‌లో విందు అయినా.. చివరకు న్యాయ వ్యవస్థకు సైతం సవాల్ విసిరి దర్జాగా బయట తిరుగుతున్నాడు. తల్లికి సీరియస్‌గా ఉందని అత్యవసరంగా చెన్నై అపోలో ఆస్పత్రిలో ఆపరేషన్ చేయించాలని గుంటూరుకు చెందిన ప్రముఖ వైద్యుడు సంతకాన్ని ఫోర్జరీ చేసి నకిలీ సర్టిఫికెట్ సృష్టించి హైకోర్టు నుంచి బెయిల్ పొడిగించుకుని అజ్ఞాతంలోకి వెళ్లిన వ్యవహారం కలకలం రేపు తోంది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ వ్యవహారంతో పోలీ సులు కంగుతిని ఇప్పుడు హడావుడి చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లపాటు బోరుగడ్డ అనిల్ రాజ్యాంగేతర శక్తిగా రెచ్చిపోయాడు. అప్పటి సీఎం జగన్‌కు వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా వారిపై అసభ్య పదజాలం, దూషణలతో సోషల్ మీడియా వేదికగా రెచ్చిపోయాడు. ఎవరైనా ప్రశ్నిస్తే నేరుగా సీఐడీ అధికారులతో వారిని బెదిరించాడు. గడిచిన ఐదేళ్ల ప్రభుత్వ వ్యవస్థలన్నీ తన గుప్పెట్లో ఉన్నాయన్నట్లుగా ప్రవర్తిస్తూ అత్యంత హేయమైన భాషలో రెచ్చిపోయాడు. మహిళలు సిగ్గుతో తల దించుకునే విధంగా అసభ్యకరమైన పదజాలంతో బెదిరింపులకు పాల్పడ్డాడు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రవ్యాప్తంగా అనేక పోలీస్‌స్టేషన్లలో బోరుగడ్డ అనిల్‌పై ఫిర్యాదులు వెల్లువెత్తాయి. గుంటూరులోని ఏఈఎల్సీ చర్చి ట్రెజరర్ బాబుప్రకాష్‌పై హత్యాయత్నం కేసులో బోరుగడ్డ అనిల్‌ను గత అక్టోబరు 15న అరండల్‌పేట పోలీసులు అరెస్టు చేశారు. ఆ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా వివిధ పోలీస్‌స్టేషన్లలో 14 కేసులు నమోదు కాగా పోలీసులు కోర్టులలో పిటి వారెంట్లు దాఖ లు చేసి సంబంధిత కోర్టుల్లో హాజరు పరిచారు. తాను కేంద్ర మంత్రి పీఏని అంటూ అనంతపురం జిల్లాకు చెందిన కలెక్టర్, ఎస్పీకి ఫోన్ చేసి చర్చి ఆస్తులు వివాదంలో తలదూర్చి బెది రింపులకు పాల్పడ్డాడు. ఆ కేసులో రాజమండ్రి సెంట్రల్ జైల్లో గత అక్టోబరు నుంచి రిమాండ్‌లో ఉన్నాడు. ఈ క్రమంలో అనేకసార్లు బెయిల్ కోసం ప్రయత్నించి విఫలమయ్యాడు. అయితే అనంత పురం నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులో అక్కడ జిల్లా కోర్టు బోరుగడ్డ బెయిల్ తిరస్కరించింది. దీంతో గత ఫిబ్రవరి 14న హైకోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేసుకున్నాడు. తన తల్లికి ఆరోగ్యం సరిగాలేదని వైద్యం చేయించాలని కోర్టును ఆశ్రయించడంతో కోర్టు ఫిబ్రవరి 28 సాయంత్రం వరకు బెయిల్ మంజూరు చేసింది. దీంతో ఫిబ్రవరి 15న విడుదలయ్యాడు. హైకోర్టు ఆదేశాల మేరకు ఫిబ్రవరి 28న రాజమండ్రి కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ ముందు లొంగిపోయాడు. అయితే తన తల్లి పద్మావతి ఊపిరితిత్తులు, గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతుందని, ఆమెకు చెన్నైలోని అపోలో ఆస్పత్రిలో అత్యవసర చికిత్స అందించాలని గుంటూరులోని లలితా ఆస్పత్రికి చెందిన డాక్టర్ రాఘవ శర్మ సిఫార్సు చేసినట్లు ఆయన లెటర్ హెడ్‌పై సంతకాన్ని ఫోర్జరీ చేసి నకిలీ మెడికల్ సర్టిఫికెట్ సృష్టించి కోర్టులో బెయిల్ పొడిగింపు కోసం దాఖలు చేశాడు. అది నిజమైనదేనని నమ్మిన హైకోర్టు అయనకు ఈ నెల 11 వరకు బెయిల్ మంజూరు చేసింది. 11న సాయంత్రం జైలు సూపరింటెండెంట్ ఎదుట లొంగిపోవాలని ఆదేశించింది. అయితే ఆయన దాఖలు చేసిన సర్టిఫికెట్‌పై ఎటువంటి సమాచారం లేదని పీపీ వాదించడంతో ఆ సర్టిఫికెట్ ప్రామాణికతపై విచారించాలని కోర్టు ఆదేశించింది. బెయిల్‌పై బయటకు వచ్చిన తర్వాత నకిలీ సర్టిఫికెట్ విషయం వెలుగుచూడటంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. అయితే ఇప్పటికే బోరుగడ్డ అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. చెన్నై అపోలో ఆస్పత్రిలో పోలీసులు విచారించగా ఈ నెల 3న బోరుగడ్డ పద్మావతి డిశ్చార్జ్ అయినట్లు తేలింది. అయితే ఆ తర్వాత నుంచి ఆమె గాని, బెయిల్‌పై బయటకు వచ్చిన ఆమె తనయుడు అనిల్ ఆచూకీగాని తెలియరాలేదని పోలీసులు అంటున్నారు. అనిల్ నకిలీ సర్టిఫికెట్ సృష్టించిన విషయం పక్కన పెడితే ఆయనకు హైకోర్టు ఈనెల 11 వరకు బెయిల్ పొడిగించింది. ఈలోపు కోర్టు నుంచి ఎటువంటి ఉత్తర్వులు రాని పక్షంలో ఈ నెల 11 వరకు బోరుగడ్డ అనిల్ బయట తిరిగే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలోనే పోలీసులు అతడి కదలికలను పసిగట్టేందుకు ప్రయత్నిస్తున్నా ఎటువంటి సమాచారం అందడం లేదు. గుంటూరు అమరావతిరోడ్డులోని వేళాంగణినగర్‌లోని బోరుగడ్డ అనిల్ ఇంటికి తాళాలు వేసి ఉన్నాయి. ఆయన సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్ వస్తోంది. దీంతో ఆయన కదలికలు ప్రశ్నార్థకంగా మారాయి.

# బాపట్లలో మహిళా దినోత్సవ సంబరం

- పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న మహిళా ఉద్యోగులు

బాపట్ల, మార్చి 7(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏపీజేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ఆవరణలో సంబరాలు జరిగాయి. మహిళా ఉద్యోగులకు వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు. పోటీలలో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ జె.వెంకటమురళి మాట్లాడుతూ మహిళలపై లింగవివక్ష లేకుండా ప్రతి కుటుంబంలో చిన్నారులను నైతిక విలువలతో పెంచాలని, అప్పుడే సమాజంలో అత్యాచారాలు జరగకుండా నివారించగలమన్నారు. మహిళలు సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలలో సగభాగం ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యమన్నారు. మహిళల రక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వివిధ పోటీలలో గెలుపొందినవారికి కలెక్టర్ బహుమతులు ప్రదానం చేశారు. చిన్నారుల నృత్యప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. ఆర్డీవో పి.గ్లోరియా, జిల్లా ఖజానా శాఖాధికారి కామేశ్వరి, పౌర సంబంధాల అధికారి కె.సుబాషిణి, సీడీపీవో లక్ష్మీపార్వతిలను కలెక్టర్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో జి.గంగాధర్ గౌడ్, సీపీవో శ్రీనివాస్, డీఎస్‌డీవో కె.పాల్‌కుమార్, జేఏసీ ఛైర్మన్ సురేష్, మహిళా విభాగ ఛైర్మన్ రజని తదితరులు పాల్గొన్నారు.





టగ్గాఫ్ వార్‌ను ప్రారంభించి పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటమురళి, పోటీలలో పాల్గొన్న మహిళలు

## జిల్లా మహిళా అధికారుల ట్రెక్కింగ్



నరసరావుపేట కల్చరల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎస్పీ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జిల్లాలోని మహిళా అధికారిణులు వినూత్నంగా కోటప్పకొండపై శుక్రవారం ట్రెక్కింగ్ చేశారు. మహిళలు ఉత్సాహంగా కొండపైకి ఎక్కారు. వీరితో పాటు కలెక్టర్, ఎస్పీలు ట్రెక్కింగ్ చేశారు. ట్రెక్కింగ్ అనంతరం కొండపైకి చేరుకుని అందరూ విజయ చిహ్నాన్ని చూపించారు.

## ఆరోగ్య శాఖలో 30 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

గుంటూరు మెడికల్ , మార్చి 7 (ఆంధ్రజ్యోతి): వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్, సెకండరీ హెల్త్ (విజయవాడ) ఆదేశాల ప్రకారం జిల్లాలో సెకండరీ హెల్త్ వైద్యశాలల్లో ఖాళీగా ఉన్న 30 పోస్టులకు పొరుగు సేవల పద్ధతిలో పని చేసేందుకు వివిధ కేటగిరిల్లో అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్యశాలల సమన్వయాధికారి డాక్టర్ ఎం మజీదాబీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలపారు. డెంటల్ టెక్నీషియన్ (ఒక పోస్టు), ల్యాబ్ టెక్నీషియన్ (రెండు పోస్టులు), ఎలక్ట్రీషియన్ (రెండు పోస్టులు), కౌన్సెలర్ (ఒక పోస్టు), జనరల్ డ్యూటీ అటెండెంట్ (13పోస్టులు), పోస్ట్ మార్టమ్ అసిస్టెంట్ (మూడు పోస్టులు), థియేటర్ అసిస్టెంట్ (ఐదు పోస్టులు), ఆఫీస్ సబార్డినేట్ (మూడు పోస్టులు) భర్తీ చేస్తున్నట్లు ఆమె తెలిపారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈ నెల 18వ తేదీలోపు గుంటూరు పట్టాభిపురంలోని జిల్లా వైద్యశాలల సమన్వయాధికారి కార్యాలయానికి పంపాలని ఆమె కోరారు. తర్వాత అందే దరఖాస్తులను పరిశీలించబోమని డాక్టర్ మజీదాబీ వెల్లడించారు.

## చెన్నై ఎక్స్‌ప్రెస్ ఇక చర్లపల్లి నుంచి

గుంటూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): గత కొన్ని దశాబ్దాలుగా నిత్యం హైదరాబాద్ నుంచి చెన్నై సెంట్రల్‌కు, చెన్నై సెంట్రల్ నుంచి హైదరాబాద్‌కు గుంటూరు మీదుగా రాకపోకలు సాగిస్తున్న చెన్నై ఎక్స్‌ప్రెస్ టెర్మినల్‌ని రైల్వే శాఖ మార్పు చేసింది. ఇక నుంచి ఈ రైలు సికింద్రాబాద్ స్టేషన్‌కు సమీపంలో అధునాతన సౌకర్యాలతో అభివృద్ధి చేసిన చర్లపల్లి రైల్వేస్టేషన్ నుంచి బయలుదేరుతుంది. శుక్రవారం బయలుదేరి నంబరు. 12603 చెన్నై సెంట్రల్ - చర్లపల్లి ఎక్స్‌ప్రెస్ శనివారం వేకువజామున 5.10కి చర్లపల్లి చేరుకొని ఆగిపోతుంది. అలానే నంబరు. 12604 చర్లపల్లి - చెన్నై సెంట్రల్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 8వ తేదీ శనివారం నుంచి చర్లపల్లిలో సాయంత్రం 5.25కి బయలుదేరి మరుసటి రోజు వేకువజామున 5.40కి చెన్నై సెంట్రల్‌కి చేరుకొంటుందని గుంటూరు డీఆర్ఎం ఎం.రామకృష్ణ తెలిపారు.

## యూనివర్సిటీకి మూడు పతకాలు

పెదకాకాని, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నేషనల్ యూత్ ఫెస్టివల్లో మెరిసింది. నోయిడాలోని అమిటి యూనివర్సిటీలో జరిగిన 38వ అంతర్ విశ్వవిద్యాలయాల నేషనల్ యూత్ ఫెస్టివల్ పోటీలలో మూడు పతకాలు సాధించి వర్సిటీ కీర్తిని రెట్టింపు చేసింది. మైమ్‌లో మూడో బహుమతి స్పాట్ ఫొటోగ్రఫీలో సాధించామని యూనివర్సిటీ యూత్ ఫెస్టివల్ కోఆర్డినేటర్ ఆచార్య ఎస్. మురళీమోహన్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.గంగాధరరావు, ఇన్‌చార్జి రెక్టార్ ఆచార్య కె.రత్న షీలామణి, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ జి.సింహాచలం వర్సిటీ యూత్ ఫెస్టివల్ జట్టును అభినందించారు. అలాగే జట్టు జాతీయ స్థాయిలో పతకాలు సాధించేలా తర్ఫీదు ఇప్పించి కృషి చేసినందుకు కోఆర్డినేటర్ మురళీమోహన్‌ను అభినందించారు.



## కేంద్రీయ విద్యాలయాల్లో ప్రవేశానికి వేళాయె

- ఉమ్మడి జిల్లాలో ఐదు కేవీలు
- బాలవాటిక (నర్సరీ) నుంచి 11వ తరగతి వరకు..
- ఈ నెల 21 అడ్మిషన్లుకు చివరి తేదీ




నల్లపాడు కేంద్రీయ విద్యాలయం

గుంటూరు (విద్య) మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఒత్తిడి లేని విద్యతోపాటు విద్యార్థుల సంపూర్ణ వికాసానికి అవకాశం కల్పించే క్రీడా, సాంస్కృతిక, సాంకేతిక, వైజ్ఞానిక, కళా రంగాల్లో నైపుణ్యాలను నేర్పిస్తూ చదువులో రాణించేలా విశేష కృషి చేసే విద్యాసంస్థల్లో కేంద్రీయ విద్యాలయాలు అగ్రస్థానంలో ఉంటాయి. వీటిల్లో ప్రవేశానికి కేంద్రీయ విద్యాలయ సంఘటన్ (కేవీఎస్) గురువారం నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందులో ప్రాథమిక స్థాయిలో నర్సరీ (బాలవాటిక)తోపాటు ఒకటో తరగతి నుంచి 11వ తరగతి వరకు ప్రవేశాలు కల్పిస్తారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు, వాటి అనుబంధ సంస్థలు, రక్షణ రంగ సంస్థల్లో పనిచేసే తల్లిదండ్రుల పిల్లలకు ఎక్కువ అవకాశం ఉన్నా, సాధారణ ప్రజల పిల్లలే ఎక్కువ మంది ఈ విద్యాలయాల్లో చదువుతూ ఉంటారు.

**జిల్లాలో ఎక్కడెక్కడ అంటే..**

ఉమ్మడి జిల్లాలో గుంటూరు నగరానికి సమీపంలోని నల్లపాడు, తెనాలి, బాపట్ల, సత్తెనపల్లి సమీపంలోని ఇర్లపాడులో కేంద్రీయ విద్యాలయాలు ఉన్నాయి. గుంటూరు నగరానికి సమీపంలోని నల్లపాడులో రెండు షిఫ్టుల్లో పాఠశాల నిర్వహిస్తున్నారు. ఒకటో తరగతి నుంచి 11వ తరగతి వరకు ప్రవేశాలు కల్పిస్తారు. బాలవాటిక (ప్రీ ప్రైమరీ 1 ,2, 3 )తో పాటు ఒకటో తరగతిలో ప్రవేశాలకు అడ్మిషన్లు నిర్వహిస్తున్నారు. ప్రతి స్కూల్‌లో బాలవాటికలో 40 , 1వ తరగతిలో 40 సీట్లు ఉంటాయి. ఇతర తరగతుల్లో అందుబాటులో ఉన్న ఖాళీల ప్రకారం సీట్లు భర్తీ చేస్తారు.

**వయోపరిమితి... రిజర్వేషన్లు**

రిజర్వేషన్ ప్రకారం ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 7.5 శాతం, ఓబీసీ అభ్యర్థులకు 27 శాతం, దివ్యాంగులకు 3 శాతం సీట్లు కేటాయిస్తారు. రిజర్వేషన్ కేటగిరీ అభ్యర్థులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం వయోపరిమితి కల్పిస్తారు. ఆసక్తి, అర్హత ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులు అడ్మిషన్లు, ఇతర వివరాల కోసం https://kvsonlineadmission.kvs.gov.in అనే వెబ్ సైట్‌లో పూర్తి వివరాలు చూడవచ్చునని నల్లపాడు కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.విజయకుమార్ తెలిపారు.

## ఉజ్జీవం కోసం ప్రపంచమంతా ప్రార్థన





దైవ సందేశాన్ని వివరిస్తున్న అబ్రహం, ప్రార్థనలో విశ్వాసులు

అమరావతి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ప్రపంచం మొత్తం నేడు ఉజ్జీవం కోసం ప్రార్థన చేస్తుందని హోసన్న మినిస్ట్రీస్ అధ్యక్షుడు అబ్రహం అన్నారు. లేమల్లె గ్రామంలోని దయాక్షేత్రంలో జరుగుతున్న 48వ గుడారాల పండగ రెండో రోజు సాయంత్రం జరిగిన కార్యక్రమంలో అబ్రహం ప్రభువు సందేశాన్ని విశ్వాసులకు అందించారు. ముందుగా పాస్టర్ పైడిపాల్, ప్రేమక్కలు తమ దైవజనులతో దేవుని పాటలు ఆలపించారు. అనంతరం అబ్రహం మాట్లాడుతూ ఉజ్జీవం అంటే తనను తాను ఉత్తేజం చేసుకుని, దేవుని కొరకు లెగవడం అన్నారు. దేశం, సంఘాలు, విశ్వాసి, సేవకుడు ఉజ్జీవింపబడాలి అని సంఘాలు ప్రార్థన చేస్తుంటాయని తెలిపారు. నిజమైన ఉజ్జీవమంటే దేవుని కోసం లేవాలి, ప్రార్థన చేయాలి, దేవుని మాట లేకపోతే బతకలేను, ఆయన్ను స్తుతించకుండా ఉండలేను అనే భావంతో మెలగాలి అని అన్నారు. ప్రజలకు రక్షణ కావాలి అనే సంకల్పం ఎప్పుడైతే ఏర్పడుతుందో దానిని ఉజ్జీవం అంటారని వివరించారు. అలా విశ్వాసులు అందరూ మెలగాలని సూచించారు. అనంతరం చీఫ్ పాస్టర్ జాన్‌వెస్లీ తన ప్రసంగాన్ని వినిపించారు. రెండో రోజు గుడారాల పండగకు వివిధ ప్రాంతాల నుంచి లక్షలాది మంది తరలివచ్చారు. విశ్వాసులు దేవునికి తెలిపిన స్తోత్రాలతో దయాక్షేత్రం మార్మోగింది.

**ఆటో, ట్రాక్టర్ ఢీ: నలుగురికి గాయాలు**

మండల పరిధిలోని లేమల్లె గ్రామం వద్ద ప్రయాణికులతో వస్తున్న ఆటోను, వాటర్ ట్యాంకర్‌తో వెళ్తున్న ట్రాక్టర్ ఢీకొనడంతో ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురికి గాయాలైయ్యాయి. అమరావతిలోని ప్రభుత్వ వైద్యశాలకు తీసుకువచ్చి చికిత్స చేయించారు.

## అన్ని రంగాల్లో సమానత్వం సాధించాలి

- డీఆర్ఎం ఎం.రామకృష్ణ



రైల్వేలో జరిగిన కార్యక్రమంలో డీఆర్ఎం రామకృష్ణ

గుంటూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో సాధికారత, సమానత్వం సాధించినప్పుడే దేశం సమగ్రంగా అభివృద్ధి చెందుతుందని గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్ ఎం.రామకృష్ణ అన్నారు. శుక్రవారం పట్టాభిపురంలోని రైల్‌వికాస్ భవన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళ ఉద్యోగులకు క్రీడలు, సాంస్కృతిక పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో డీఆర్ఎం మాట్లాడుతూ నేడు అన్ని రంగాల్లో మహిళలు ముందుకొస్తున్నారని, ఇంకా కొన్నింటిలో సమానత్వం సాధించాల్సి ఉందన్నారు. పురుషులతో సమానంగా మహిళలను ప్రోత్సహించడం అందరి బాధ్యత అని చెప్పారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం కె.సైమన్, దక్షిణ మధ్య రైల్వే మహిళ ఉద్యోగుల సంఘం గుంటూరు డివిజన్ అధ్యక్షురాలు ఎం.ఆశ లత, సీనియర్ డీపీవో షాబాన్ హనూర్, సీనియర్ డీఈఎన్ కో-ఆర్డినేషన్ జేవీ అనూష, సీనియర్ డీఎఫ్ఎం బి.అమూల్యరాజ్, డీసీఎం ప్రదీప్ కుమార్, షర్మిల, ఏడీఎంవో డాక్టర్ సీహెచ్ సింధూ పాల్గొన్నారు.

## క్రికెట్ పోటీల్లో విజేత శ్రీకాకుళం జట్టు




విజయం సాధించి ట్రోఫీ అందుకుంటున్న శ్రీకాకుళం జట్టు

గుంటూరు సిటీ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్స్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి క్రికెట్ లీగ్- 2025 పోటీలలో శ్రీకాకుళం జట్టు విజయం సాధించింది. నాగార్జున యూనివర్సిటీ సమీపంలోని స్టేడియంలో గత నాలుగు రోజులుగా జరిగిన క్రికెట్ లీగ్ శుక్రవారం ముగిసింది. ఫైనల్‌లో కృష్ణా, శ్రీకాకుళం జిల్లా జట్లు తలపడ్డాయి. 137/3 స్కోర్ సాధించిన శ్రీకాకుళం జట్టు విజయం సాధించింది. బహుమతులను ఏపీఎల్‌డీఏ సీఈవో డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, డాక్టర్ ఎస్.రజని కుమారి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి ఓ.నరసింహారావు మాట్లాడుతూ క్రికెట్ లీగ్-2025కు సహకరించిన సక్కు గ్రూపు, పద్మజా ల్యాబ్స్, హిందుస్థాన్ ఫార్మా, ఐకాన్ బయోలాజికల్స్, స్వస్తిక్ ఫార్మా, అక్లిన్ ఫార్మా, టీవీఎస్ లేబరేటరీస్, మల్లేశ్వరి ఆగ్రో ఏజెన్సీ, వర్షా గ్రూప్స్, ఇంటాస్ ఫార్మా, బోవి మని క్లైండ్, వెట్ ఇండియా, వెట్ ఫార్మా, డ్యూయల్స్ వెట్ క్లినిక్ సంస్థలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## బైక్‌పై విన్యాసాలు చేసిన వ్యక్తి కోసం పోలీసుల ఆరా



రింగ్‌రోడ్డులోని విద్యానగర్ మెయిన్‌రోడ్డుపై యువకుడి విన్యాసాలు

గుంటూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెస్ట్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని విద్యానగర్ మెయిన్ రోడ్డుపై శుక్రవారం ద్విచక్ర వాహనంపై విన్యాసాలు చేసిన ఘటనను పోలీసు ఉన్నతాధికారులు సీరియస్‌గా పరిగణించారు. ద్విచక్ర వాహనం ముందు చక్రాన్ని గాలిలోకి లేపి అతివేగంగా విన్యాసాలు చేస్తూ దూసుకెళ్లిన సంఘటనపై శుక్రవారం ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఎస్పీ సీరియస్‌గా పరిగణించి ఆ యువకుడ్ని పట్టుకోవాలని ఆదేశించారు. దీంతో ట్రాఫిక్ డీఎస్పీ రమేష్ బాబు ఆధ్వర్యంలో వెస్ట్ ట్రాఫిక్ సీఐ సింగయ్య ద్విచక్ర వాహనంపై విన్యాసాలు చేసిన యువకుడిని గుర్తించేందుకు తీవ్రంగా శ్రమించారు. అయితే రింగ్ రోడ్డులో ఉన్న సీసీ కెమెరాలు ద్విచక్ర వాహనం నంబరును గుర్తించే పరిస్థితి కనిపించలేదు. దీంతో ట్రాఫిక్ పోలీసులతో పాటు ట్రాన్స్‌పోర్టు అధికారులు సంయుక్తంగా సాంకేతిక పరిజ్ఞానంతో శుక్రవారం రాత్రి ఆ ద్విచక్ర వాహనం నంబరును గుర్తించారు. ఏటీ అగ్రహారం చిరునామా వచ్చింది. దీంతో శనివారం ఆ యువకుడిని అదుపులోకి తీసుకోనున్నారు. ద్విచక్ర వాహనంపై విన్యాసాలు చేసింది అతడే అని తేలితే అతనిపై చట్టపకారం కఠిన చర్యలు తీసుకుంటామని వెస్ట్ ట్రాఫిక్ సీఐ సింగయ్య తెలిపారు.

## జనసేన ఆవిర్భావ సభను జయప్రదం చేయండి

- జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గాదె వెంకటేశ్వరరావు, వీరేళ్ల

పెదకాకాని, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): జనసేన ఆవిర్భావ సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. శుక్రవారం పెదకాకానిలోని మండల జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీన పిఠాపురంలో జరుగు జనసేన పార్టీ 12వ ఆవిర్భావ సభకు మండలం నుంచి పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో జనసేన పార్టీ మండల ఆర్గనైజర్ సెక్రెటరీ షైలా శ్రీనివాసరావు (బుజ్జి), మండల అధ్యక్షుడు వీరెళ్ల వెంకటేశ్వరరావు, గ్రామ అధ్యక్షుడు మండలనేని శ్రీను, సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం శుక్రవారం నాటికి 525.20 అడుగులు ఉంది. ఇది 158.92 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 8023 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8629 క్యూసెక్కులు, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 7840 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్ఎల్‌సీ ద్వారా 280 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 26,572 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

## అందరికీ సాగరమాత ఆశీస్సులు

- గోరంట్ల గురుశ్రీ జోసఫ్



దైవ సందేశం అందిస్తున్న జోసఫ్

మాచర్ల రూరల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పరిశుద్ధాత్మ అయిన ఏసుక్రీస్తుకు జన్మనిచ్చిన సాగరమాత ఆశీస్సులు అందరికీ ఉంటాయని గోరంట్ల గురుశ్రీ గోపు జోసఫ్ అన్నారు. విజయపురిసౌత్‌లోని సాగరమాత ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. జోసఫ్ దివ్యపూజాబలి నిర్వహించి భక్తులకు దైవ సందేశం అందించారు. సాగరమాతను భక్తి విశ్వాసాలతో ప్రార్థిస్తే కోరిన కోర్కెలు తీరుతాయన్నారు. ముందుగా ఉదయం 5.30 గంటలకు సాగర్‌మాత ఆలయ విచారణ గురువులు జోసఫ్ బాలసాగర్, 6.30 గంటలకు జోసఫ్ తంబిలు దివ్య పూజాబలి నిర్వహించారు. కొవ్వొత్తులతో తేరు ప్రదక్షణ గావించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. విజయపురిసౌత్ కమ్యూనిటి వైద్యశాల డాక్టర్ కేపీ చారి, కొప్పునూరు పీహెచ్‌సీ డాక్టర్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యాన వైద్య శిబిరం నిర్వహించారు. సంవృద్ధి ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని విజయపురిసౌత్ ఎస్ఐ మహ్మద్ షఫి ప్రారంభించారు. రాత్రి 8 గంటలకు సాగరమాత కళాకారుల బృందంచే యేసేపు చరిత్ర బుర్రకథ, 9 గంటలకు ధనవంతుడు బీదలాజరు బైబిల్ నాటకం ప్రదర్శించారు.

## వైసీపీకి గూడూరు నానీ ముదిరాజ్ రాజీనామా



మాట్లాడుతున్న గూడూరు నాని ముదిరాజ్

గుంటూరు(తూర్పు), మార్చి 7(ఆంధ్రజ్యోతి): ముదిరాజ్ యువసేన రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు నాని ముదిరాజ్ వైసీపీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. బ్రాడీపేటలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ వాదాన్ని బీసీల్లోకి తీసుకెళ్లి 2019లో పార్టీ గెలుపు కోసం కృషి చేశామన్నారు. ముదిరాజ్‌లను నిర్లక్ష్యం చేయడం వల్లే 11 సీట్లకు మాత్రమే జగన్ పరిమితమయ్యారని చెప్పారు. వైసీపీ కారణంగా ఆర్థికంగా నష్టపోయానని ఆవేదన వ్యక్తం చేశారు. చివరికి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 18 లక్షల ముదిరాజ్ కోసం కమ్యూనిటీ భవనాన్ని ఏర్పాటు చేసుకోలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. విడదల రజిని ఆర్థిక వనరులను దోచుకున్నారని ఆరోపించారు. సమావేశంలో సంఘ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు గోగు శ్రీదేవి, వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లికార్జున ముదిరాజ్, దేవళ్ల వెంకట్, బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

## ఎకో ఫ్రెండ్లీ ప్రొడక్ట్స్ ప్రదర్శన, అమ్మకం

పెదకాకాని, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో సీఎస్ ఆర్ విభాగం ద్వారా శిక్షణ పొందిన మహిళా పునరావాస కేంద్రం (జేఎమ్‌జే, శక్తి సదన్ ఉజ్వల హోమ్) మహిళలు తయారు చేసిన అనేక ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకం ఈ నెల 10 నుంచి 17వ తేదీ వరకు వర్సిటీలోని డైక్‌మెన్ ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు టీఎస్ఆర్ సంచాలకురాలు డాక్టర్ బి.బబిత శుక్రవారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎకో ఫ్రెండ్లీ ప్రొడక్ట్స్ ప్రదర్శన, అమ్మకం సమాచార కరపత్రాన్ని ఏఎన్‌యూ ఉపకులపతి ఆచార్య కంచర్ల గంగాధరరావు, రెక్టార్ ఆచార్య జి. సింహాచలం ఆవిష్కరించారు. కార్యక్రమంలో హోమ్ నిర్వాహకురాలు రోజ్ రీనా, ఎమ్.రూప తదితరులు పాల్గొన్నారు.

## పింఛన్ సొమ్ముతో పరారైన ఉద్యోగి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న దాచేపల్లి సీఐ భాస్కరరావు, పక్కన ఎస్ఐ పాపారావు

దాచేపల్లి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లి నగర పంచాయతీలో పింఛన్ సొమ్ముతో పరారైన వెల్ఫేర్ అసిస్టెంట్ సంపతి లక్ష్మీ ప్రసాదు శుక్రవారం దాచేపల్లి పోలీసు స్టేషన్‌లో లొంగిపోయాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. దాచేపల్లి సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న సంపతి లక్ష్మీ ప్రసాదు ఈ నెల 1వ తేదీన పింఛన్లు అందజేస్తూ కొంత సొమ్ముతో కన్పించకుండా పోయాడు. ఫిబ్రవరి 28వ తేదీన బ్యాంక్ నుంచి రూ. 34.18 లక్షలు విత్ డ్రా చేశాడు. రూ.11,12,500 సొమ్ముతో పరారయ్యాడు. అనంతరం రెండు రోజుల క్రితం సచివాలయ ఉద్యోగి ఆన్‌లైన్ బెట్టింగ్‌లతో మోస పోయానని, తనను క్షమించాల్సిందిగా తన కుటుంబ సభ్యులతో కలిసి ఉన్నతాధికారులను వేడుకున్నాడు. ఈ సెల్ఫీ వీడియోపై మంత్రి నారా లోకేశ్ స్పందించారు. ఈ సంఘటనల అనంతరం శుక్రవారం దాచేపల్లి పోలీసు స్టేషన్‌కు వచ్చి లొంగిపోయాడు. పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ భాస్కరరావు పర్యవేక్షణలో ఎస్ఐ పాపారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి

వినుకొండటౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఎదురెదురుగా లారీ, ఆటో ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని కొత్తపాలెం సమీపంలోని ఇండియన్ పెట్రోల్ బంక్ వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. యర్రగొండపాలెం మండలం పాలఉట్ల గ్రామం నుంచి 175 టిక్కీల మిర్చితో గుంటూరు వైపు వెళ్తున్న లారీ, గుంటూరు నుంచి త్రిపురాంతకం మండలం విశ్వనాథపురం వెళ్తున్న ఫోర్‌వీల్ ఆటో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఫోర్‌వీల్ ఆటోలోని విశ్వనాథపురం గ్రామానికి చెందిన తొలుసూరి యల్లయ్య (31) అక్కడికక్కడే మృతి చెందాడు. గుంటూరు వెళ్తున్న లారీలోని డ్రైవర్ జవహర్‌లాల్ నాయక్, లోకేశ్ నాయక్‌లకు స్వల్పగాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న హైవే సిబ్బంది సంఘటనా ప్రాంతానికి చేరుకొని ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ఆటోను పక్కకు తీసి రాకపోకలకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు. యల్లయ్య మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

## విద్యుత్ చౌర్యం కేసులో జైలు శిక్ష

గుంటూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చౌర్యం కేసులో నిందితుడికి కోర్టు జైలు శిక్ష విధించింది. విజిలెన్స్ అండ్ ట్రాన్స్‌కో సీఐ డి.వెంకన్న చౌదరి తెలిపిన వివరాల మేరకు.. పల్నాడు జిల్లా, రెంటచింతల మండలం రెంటాల గ్రామానికి చెందిన వేల్పుల పెద్ద ఏసు గతంలో విద్యుత్తు చౌర్యానికి పాల్పడిన కేసులో జరిమానా చెల్లించాడు. అయినప్పటికీ మళ్లీ విద్యుత్ చౌర్యానికి పాల్పడ్డాడు. దీనిపై గుంటూరు ఏపీటీఎస్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైయింది. రెండో విద్యుత్ చౌర్యం కేసు నమోదు చేసి కోర్టులో ప్రవేశపెట్టారు. కోర్టు విచారణలో నేరం రుజువు కావడంతో అదనపు జిల్లా జడ్జి వీఏఎల్ సత్యవతి ఆర్నెల్లు జైలు శిక్ష లేదా రూ. 85 వేలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

**నెక్ సూచించిన కోడిగుడ్ల ధర**

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.20
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

**బ్రాయిలర్ ధరలు**

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

| | |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 91, 99, 110 |
| చికెన్ విత్ స్కిన్ | 176.00 |
| చికెన్ స్కిన్ లెస్ | 186.00 |

## 1,22,426 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 1,11,958 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,22,426 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 44,470 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

| వెరైటీ | కనిష్ఠధర | గరిష్ఠధర |
|---|---|---|
| **నాన్ ఏసీ కామన్ వెరైటీ** | | |
| 334 | 10000 | 13800 |
| నంబరు. 5 | 10000 | 13500 |
| 273 | 10000 | 13200 |
| 341 | 10500 | 14500 |
| 4884 | 10000 | 11000 |
| సూపర్ 10 | -- | -- |
| **నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ** | | |
| తేజ | 10500 | 14000 |

| వెరైటీ | కనిష్ఠధర | గరిష్ఠధర |
|---|---|---|
| షార్క్-1 | 11500 | 12700 |
| బ్యాడిగి 355 | 10500 | 13800 |
| సింజెంటా | | |
| బ్యాడిగి 5531 | 10500 | 12200 |
| ఎన్ఎస్ 250 | | |
| బుల్లెట్ | -- | -- |
| దేవనూరు డీలక్స్ | 10000 | 13300 |
| ఆర్మూరు | 10000 | 11500 |
| తాలుకాయలు | 5000 | 7500 |

## ప్రజా సమస్యలు నేడు మంత్రికి తెలియజేయవచ్చు : రామకృష్ణ

చెరుకుపల్లి, మార్చి7 (ఆంధ్రజ్యోతి) : మంత్రి అనగాని సత్యప్రసాద్ శనివారం సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటల వరకు రేపల్లె పార్టీ కార్యాలయంలో అందుబాటులో ఉంటారని ప్రజలు, కార్యకర్తలు తమ సమస్యలు మంత్రికి విన్నవించుకోవచ్చని చెరుకుపల్లి మండల టీడీపీ అధ్యక్షుడు మల్లాది రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు.

## రూ.4.39 కోట్లతో 28 రోడ్ల మరమ్మతులు

● ఆర్ అండ్ బీ డీఈఈ అరుణకుమారి






బాపట్ల, మార్చి7 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల సబ్ డివిజన్ పరిధిలో 28 రోడ్లను 4.39 కోట్ల రూపాయలు వెచ్చించి మరమ్మతులు చేయటం జరిగిందని ఆర్ అండ్ బీ డీఈఈ ఎస్.అరుణకుమారి తెలిపారు.

**ప్రశ్న:** బాపట్ల సబ్ డివిజన్‌లో ఎన్ని కిలో మీటర్ల రహదారులు మరమ్మతులు చేశారు?

**డీఈఈ :** 87 కిలోమీటర్ల రోడ్లపై ఉన్న గుంతలు పూడ్చి మరమ్మతులు చేయటం జరిగింది.

**ప్రశ్న:** నూతనంగా రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు చేశారా?

**డీఈఈ :** రాష్ట్ర గవర్నర్ ఆదేశాల మేరకు బాపట్ల నుంచి పాండురంగాపురం వెళ్ళే రోడ్డు 13 కోట్ల 70 లక్షల రూపాయలతో అభివృద్ధి చేయాలని ప్రతిపాదనలు పంపారు.

**ప్రశ్న:** వివిధ ప్రాంతాల్లో ఇతర పనులకు ఎంత ప్రతిపాదనలు చేశారు?

**డీఈఈ :** 100 కోట్ల రూపాయలు వెచ్చించి అభివృద్ధి పనులు చేసేందుకు ప్రతిపాదనలు చేయటం జరిగింది.

**ప్రశ్న:** కొత్తగా రోడ్లు ఏమైనా నిర్మించారా?

**డీఈఈ :** కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో 129 లక్షల రూపాయలు వెచ్చించి రోడ్లు నిర్మించి ఫుట్‌పాత్ నిర్మాణం చేస్తున్నాం.

## బాపట్ల కాలేజ్ ఆఫ్ ఫార్మసీకి జేఎన్‌టీయూ గుర్తింపు

బాపట్లరూరల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ (జేఎన్‌టీయూ), కాకినాడ పరిధిలో పరిశోధనా కేంద్రంగా బాపట్ల కాలేజ్ ఆఫ్ ఫార్మసీ గుర్తింపు పొందిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీ.ఈశ్వర్ మూర్తి తెలిపారు. ఈ సందర్భంగా బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు, సెక్రటరీ మానం నాగేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ కమిటీ బృందం మాట్లాడుతూ పరిశోధనా కేంద్రంగా గుర్తింపు పొందటం ఎంతో గర్వకారణం అని తెలిపారు. పీహెచ్‌డీ రీసెర్చ్ చేసే వారికి ఇది సౌకర్యాలు, నిష్ణాతులైన, సుదీర్ఘ అనుభవం కలిగిన అధ్యాపక బృందం వలనే ఇది సాధ్యపడిందని కొనియాడారు.

## నేడు జాతీయ లోక్‌అదాలత్

బాపట్ల, మార్చి7 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల కోర్టుల ప్రాంగణంలో శనివారం జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్టు 6వ అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయసేవ కమిటీ చైర్మన్ కె.శ్యాంబాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. లోక్‌అదాలత్‌లో సివిల్, క్రిమినల్, భరణం కేసులు, గృహహింస కేసులు, మోటారు ప్రమాద కేసులు, చెక్‌బౌన్స్ కేసులు, బ్యాంక్ కేసులు, చెక్‌బౌన్స్ కేసులు పరిష్కరించుకోవచ్చు అన్నారు. న్యాయ సేవా సంస్థ పరిధిలోని కక్షిదారులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని రాజీ చేసుకోవాలని కోరారు.

## 10న మైత్రేయాశ్రమంలో శివకల్యాణ మహోత్సవం

చెరుకుపల్లి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : గూడవల్లిలోని మైత్రేయాశ్రమంలో ఈనెల 10వ తేదీన శివకల్యాణ మహోత్సవం జరుగుతుందని ఆశ్రమ నిర్వాహకులు నిర్మలమ్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా 8వ తేదీన సప్తాహం, 9వ తేదీన మంగళస్నానాలు, 9వ తేదీన హోమాలు, 10వ తేదీన కల్యాణం జరుపుతామన్నారు. భక్తులందరూ ఈ కల్యాణాన్ని దర్శించి స్వామి వారి కరుణాకటాక్షాలు పొందాలని కోరారు.

## నేడు స్వమిత్వ యోజన సర్వే

చెరుకుపల్లి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : స్వమిత్వ యోజన సర్వే కార్యక్రమం కింద రేపల్లె డివిజన్ పరిధిలోని 9 మండలాల నుంచి ఎంపికైన గ్రామపంచాయతీలకు శనివారం చెరుకుపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లకు ఒకరోజు శిక్షణా కార్యక్రమం జరుగుతుందని డీఎల్‌పీవో కేజేవీ శ్రీనివాసన్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని ప్రతి ఇంటికి, ఖాళీస్థలాలకు సరిహద్దులు గుర్తించటం, యాజమాన్యం గుర్తింపు కార్డులు జారీ మొదలైన శిక్షణ ఉంటుందన్నారు.

## కుమార్తె అదృశ్యంపై తల్లి ఫిర్యాదు

బాపట్ల, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని హనుమాన్ నగర్‌కు చెందిన అక్కల వీరమ్మ కుమార్తె వెంకటేశ్వరమ్మ బాపట్లలోని ప్రైవేట్ ఆసుపత్రిలో నర్సుగా పని చేస్తున్నది. ఈనెల 5వ తేదీన డ్యూటీకి అంటూ రాత్రి 8 గంటలకు ఆసుపత్రికి వెళ్ళింది. మరుసటి రోజు ఉదయం 10 గంటలకు డ్యూటీ దిగి ఇంటికిరాలేదంటూ వివరించిన తల్లి వీరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్ఐ చంద్రావతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అదనపు కట్నం కోసం వేధింపులపై...

బాపట్ల రూరల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : అదనపు కట్నం కోసం భర్త, అత్తమామలు వేధింపులకు గురిచేస్తున్నారంటూ భార్య రూరల్ పోలీసుస్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేసింది. బాపట్ల మండలం వల్లూవారిపాలెం గ్రామానికి చెందిన నక్కా సంధ్యారాణి, ఆమె భర్త అయిన కంచర్ల బోసు, అత్తమామలు అదనపు కట్నం కోసం శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నారంటూ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

# పక్కా గృహాల నిర్మాణ లక్ష్యాలను చేరుకోవాలి

● కలెక్టర్ జె.వెంకటమురళి

● లక్ష్యం పూర్తి కాని ఉద్యోగులను తొలగించేందుకు చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, మార్చి7 (ఆంధ్రజ్యోతి) : పక్కా గృహ నిర్మాణంలో ప్రభుత్వం లక్ష్యాలను చేరుకోవటానికి అధికారులు కృషి చేయాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. గృహనిర్మాణాలపై సంబంధితశాఖాధికారులతో శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణ, గ్రామీణప్రాంతాలలో మొదటి త్రైమాసికంలో జిల్లాకు 4,898 గృహాలు పూర్తి చేయాలని లక్ష్యమన్నారు. ప్రస్తుతం 454 మాత్రమే పూర్తి చేయటంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. మండలాల వారి లక్ష్యాలలో 18 కంటే తక్కువ లక్ష్యాలను పూర్తి చేసిన ఇంజనీర్లకు ఛార్జిమెమోలు తయారు చేయాలని గృహనిర్మాణశాఖాధికారికి ఆదేశించారు. మిగిలినవన్నీ నెలాఖరులోగా పూర్తి చేయాలన్నారు. లక్ష్యాలు పూర్తి చేయని వారిని ఉద్యోగాల నుంచి తొలగించటానికి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జాతీయగ్రామీణ ఉపాధిహామీ పథకం కింద గృహనిర్మాణాలలో పనిదినాలు కల్పించాలన్నారు. వేమూరు నియోజకవర్గంలో లేఅవుట్‌ల దగ్గర ఏర్పాటు చేసిన కరెంట్ వైర్లను తొలగించిన విషయంపై ఆయన ఆరా తీశారు. గృహనిర్మాణాలు జరిగిన కాలనీలో మౌలికవసతులు కల్పించటానికి ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా గృహనిర్మాణశాఖాధికారి వెంకటేశ్వర్లు, ఈఈలు, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

## మోటుపల్లిని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తాం

మోటుపల్లి ప్రాచీన ప్రాశస్త్యాన్ని వెలుగులోకి తెస్తూ పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. మోటుపల్లి గ్రామం, మ్యూజియం నిర్మాణం, వీరభద్రస్వామి దేవస్థానం అభివృద్ధి కమిటీ సమావేశం శుక్రవారం కలెక్టర్ ఛాంబర్‌లో జరిగింది. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ కాకతీయుల నాటి అభయశాసనాలను తెలుగులో అనువదిస్తున్నామని కలెక్టర్ చెప్పారు. మూడుశాసనాలలోని తాత్పర్యం ప్రజలందరికి అర్థమయ్యేలా సాధారణ తెలుగుభాషలోకి అనువదిస్తూ రాశ్నపై చెక్కిస్తున్నామన్నారు. ప్రాచీన వైభవం తెస్తేలా ఆలయం అభివృద్ధి చేస్తామన్నారు. కోదండరామ దేవాలయానికి సమీపంలోని 5.8 ఎకరాల భూమిని ఆలయానికి కేటాయించాలన్నారు. కాకతీయులు, చోళరాజుల నాటి శాసనాలు, పంచలోహాలను చిన్నగంజాంలోని భద్ర పర్యటనకు మ్యూజియం నిర్మించాల్సి ఉందని కలెక్టర్ చెప్పారు. మ్యూజియం నిర్మాణంపై పురావస్తుశాఖకు సమగ్ర నివేదికతోపాటు లేఖ పంపాలని అధికారులను ఆదేశించారు. ప్రాచీన కాలం నాటి బుద్ధుడు విగ్రహాన్ని భద్రపర్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూఅధికారి జి.గంగాధర్‌గౌడ్, చీరాల ఆర్డీవో చంద్రశేఖర్, దేవదాయశాఖ సహాయకమిషనర్ సూర్యప్రకాశరావు, శాసనాల పరిశోధకులు డాక్టర్ వి.రమేష్, చంద్రబాబు, పోరంపూర్‌వెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పీసీ సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

## నరసాయపాలెం గురుకుల పాఠశాలలో మౌలికవసతులు కల్పించాలి

నరసాయపాలెం గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. పాఠశాల అభివృద్ధిపై అనుబంధ శాఖల అధికారులతో శుక్రవారం కలెక్టర్ సమావేశం నిర్వహించారు. నరసాయపాలెంలోని గురుకుల పాఠశాలలో 350మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని చెప్పారు. ఇప్పటి వరకు మరుగుదొడ్లు లేక విద్యార్థులు సామాజిక అవసరాలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. యుద్ధప్రాతిపదికన పాఠశాలలో 3.5 లక్షలతో ఆర్‌ఓప్లాంట్ ఏర్పాటు చేయాలన్నారు. 24 మరుగుదొడ్లు నిర్మించేలా స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్‌కు ద్రం పంపాలని ఆదేశించారు. మధ్యాహ్నభోజన పథకంలో భాగంగా పాఠశాలకు వంటగది, భోజనశాల ఏర్పాటు చేయాలన్నారు. శ్రీదాసుధాన్ని చదువు చేయటానికి స్వచ్ఛంద సంస్థలు, దాతల సహకారం తీసుకోవాలన్నారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ అనంతరాజు, సమగ్రశిక్షాభియాన్ ఏపీసీ నాగిరెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఈ రత్నబాబు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అన్ని రంగాల్లో కీలకపాత్ర పోషిస్తున్న మహిళలు

● విద్యుత్ ఎస్ఈ గువ్వల ఆంజనేయులు



కేకును కట్ చేస్తున్న విద్యుత్‌శాఖ ఎస్ఈ ఆంజనేయులు

బాపట్ల, మార్చి7 (ఆంధ్రజ్యోతి) : మహిళలు అన్ని రంగాలలో కీలక పాత్రపోషిస్తున్నారని విద్యుత్ ఎస్ఈ గువ్వల ఆంజనేయులు అన్నారు. బాపట్లలోని విద్యుత్ ఎస్ఈ కార్యాలయంలో మహిళా దినోత్సవాన్ని కార్యాలయంలో పని చేస్తున్న మహిళలతో కలిసి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎస్ఈ ఆంజనేయులు, డీఈ తోటకూర శ్రీనివాసరావులు మహిళా దినోత్సవ కేకును కట్ చేసి మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. తమ కార్యాలయ పరిధిలో పని చేస్తున్న మహిళలందరికి ఆంజనేయులు, తోటకూర శ్రీనివాసరావు, పెరుగు శ్రీనివాసరావు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమర్షియల్ ఏడీఈ రామకోటేశ్వరరావు, టెక్నికల్ ఏఈ ఎస్.రవికుమార్, మహిళా ఉద్యోగులు శిరిరాజని, గిరిజా లక్ష్మి, అనూజ, కరుణకుమారి, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో సన్మానం



మహిళా ప్రముఖులను సన్మానిస్తున్న రెడ్‌క్రాస్ సభ్యులు

కర్లపాలెం, మార్చి7 (ఆంధ్రజ్యోతి) : బహుముఖ ప్రజ్ఞ లు మహిళలు అని, అన్ని రంగాల్లో వారు అభివృద్ధి చెందాలని కర్లపాలెం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రైర్మన్ ఇనకొల్లు పోలిసురావు అన్నారు. అంతర్జాతీయ మహిళా దిన వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని మహిళా ప్రముఖులను రెడ్‌క్రాస్ వారు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కర్లపాలెం ఎంపీడీవో ఆదూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ మహిళలు మహారాణులు అని, ఊయల ఊపిన చేతులు ప్రపంచాన్ని పాలించగలరని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుందరమ్మ, ఎంపీడీవో ఆఫీస్ సూపరింటెండెంట్ రజిని, మహిళా విద్యాశాఖాధికారి శ్రీవిజయ, జూనియర్ అసిస్టెంట్ లలితా పాల్గొన్నారు.

## జనరిక్ మెడికల్ షాపులపై అపోహలు తొలగించాలి : కలెక్టర్

బాపట్ల, మార్చి7 (ఆంధ్రజ్యోతి) : జనరిక్ మెడికల్ షాపులపై ప్రజలకు ఉన్న అపోహలను తొలగించుకోవాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. పట్టణంలోని టీచర్స్ కాలనీలో శుక్రవారం ప్రధానమంత్రి భారతీయ జనఔషధి పరియోజన మందుల షాపును కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన జనరిక్ మెడికల్ షాపులో మందులు కొనుగోలు చేసి 50 శాతం ఖర్చులు తగ్గించుకోవచ్చు అని చెప్పారు. జనరిక్ మందుల షాపులలో కూడా ప్రైవేట్ మందుల షాపులలో విక్రయించే మందులులాగా ఉంటాయని వాటిల్లో ఎలాంటి తేడా ఉండదని ప్రజలకు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. దీర్ఘకాలిక వ్యాధులతో షుగర్, బీపీ, కిడ్నీ సమస్యలు, క్యాన్సర్ వంటి రోగాలకు ఎక్కువశాతం మందులు వినియోగించుకోవాల్సి ఉంటుందని, వాటి ధరలు కూడా ఎక్కువగా ఉంటాయన్నారు. జనరిక్ మెడికల్ షాపులలో తక్కువ ధరకు కొనుగోలు చేసుకొని ఖర్చు తగ్గించుకోవచ్చునని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు సలగల రాజశేఖరబాబు, జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎస్.విజయమ్మ, ఆర్డీవో పి.గ్లోరియా, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి, వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## డీఎంహెచ్‌వో కార్యాలయాన్ని సందర్శించిన వైద్య బృందం



నేషనల్ పాపులేషన్ రీసెర్చ్ సెంటర్ వైద్యబృందంతో డీఎంహెచ్‌వో విజయమ్మ

బాపట్ల, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయాన్ని శుక్రవారం నేషనల్ పాపులేషన్ రీసెర్చ్ సెంటర్ వైద్య బృందం డాక్టర్ రమణ, డాక్టర్ పాదాలు బృంద సభ్యులతో కలిసి సందర్శించారు. రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం, రాష్ట్రీయ కిశోర స్వాస్థ్య కార్యక్రమం నేషనల్ టీబీ ఎలిమినేషన్ ప్రోగ్రాం సహాయోగంలో భాగంగా ఈ బృందం పర్యటించారు. డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మను కలిసి క్షేత్ర స్థాయిలో దూళిపూడి, వెదుళ్ళపల్లి, వేటపాలెం, ఇంకొల్లు, గుంటుపల్లి వైద్య ఆరోగ్య కేంద్రాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ మోడల్ ఆఫీసర్లు సీహెచ్ ప్రేమసావని, డాక్టర్ మహ్మద్ సాదిక్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్మీజవాన్ కుటుంబానికి ఆర్థికసాయం

పిట్టలవానిపాలెం, మార్చి7 (ఆంధ్రజ్యోతి) : పిట్టలవానిపాలెం గ్రామపంచాయతీలోని గౌడపాలేనికి చెందిన ఆర్మీ జవాన్ పఠాన మోహన్ వెంకటేష్ మృతి చెందిన విషయం తెలుసుకున్న బాపట్ల జిల్లా డిపెన్స్ సోల్జర్ గ్రూప్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబ సభ్యులకు శుక్రవారం ఆర్థిక సహాయం అందజేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని తెనాలి, పొన్నూరుతోపాటు బాపట్ల జిల్లాలో ఉన్న ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్, నేవీకి చెందిన త్రివిధ దళాలలను కలుపుకొని బాపట్ల జిల్లాలో ఈ డిఫెన్స్ సోల్జర్ గ్రూప్‌ను స్థాపించి ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. మోహన్ వెంకటేష్ కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేసినట్లు తెలియజేశారు.

## దమ్మనవారిపాలెం సచివాలయాన్ని సందర్శించిన ఎంపీడీవో

కర్లపాలెం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని గ్రామాలలో ఈనెల 7 నుంచి 18 వరకు పీ4 సర్వే గ్రామాలలో వర్క్‌ఫ్రమ్ హోమ్ సర్వే జరుగుతుందని ఎంపీడీవో ఆదూరి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని దమ్మనవారిపాలెం సచివాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించి రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ప్రతి సచివాలయంలో నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీరామలింగేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాలు ప్రారంభం

చుండూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : వందల ఏళ్ల నాటి చరిత్ర కలిగిన దివితమిలిని శ్రీగంగాపార్వతీ సమేత శ్రీరామలింగేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం వారం రోజుల పాటు ఈనెల 7 నుంచి ఈ నెల 14వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో ఈమని ఆశోక్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. బ్రహ్మశ్రీ రామయజ్ఞశర్మ వర్యవేక్షణలో హోమ, పూజాది కార్యక్రమాలు, రథోత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాట్లు జరిగాయని, దేవదాయ శాఖ, గ్రామస్తులు వివిధ గ్రామాలకు చెందిన దాతల సహకారంతో ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఈవో తెలిపారు.

## భ్రమరాంబ మల్లేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలపై సమావేశం



సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ, జడ్పీటీసీ, తహసీల్దార్, ఎంపీడీవో

భట్టిప్రోలు (కొల్లూరు), మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలపై అధికారులు, ప్రజా ప్రతినిధులు సమావేశం నిర్వహించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు అధ్యక్షతన శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 9వ తేదీ నుంచి జరిగే బ్రహ్మోత్సవాలకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలన్నారు. ఈ ఉత్సవాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. బ్రహ్మోత్సవాలకు హాజరయ్యే భక్తులకు కావాల్సిన సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సమావేశంలో తీర్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ లలితకుమారి, జడ్పీటీసీ టి.విజయభాస్కరి, ఎంపీడీవో ఎస్.వెంకటరమణ, దేవస్థాన వ్యవస్థాపక సభ్యులు కొడాలి శంకరరావు, లక్ష్మీకాంతరావు, పానకాలరావు, ఆర్‌ఐ పణికుమార్, ఆయా ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థికసాయం

రేపల్లె, మార్చి7(ఆంధ్రజ్యోతి) : విద్యుత్ షార్టుసర్క్యూట్ కారణంగా నిజాంపట్నం మండలం నక్షత్రనగర్ గ్రామంలో మూడు పూరిళ్లు దగ్ధమయ్యాయి. ఆ కుటుంబాలకు శుక్రవారం టీడీపీ సీనియర్ నాయకుడు దుండుపోలు వెంకటేశ్వరరావు ఆర్థిక సాయాన్ని అందించారు. రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆదేశాల మేరకు ఒక్కొక్క కుటుంబానికి రూ.20 వేల చొప్పున మూడు గృహాల వారికి రూ.60 వేల ఆర్థిక సాయాన్ని అందించటం జరిగిందని తెలిపారు. ఈకార్యక్రమంలో రూరల్ సీఐ సురేష్‌బాబు, దుండుపోలు పిచ్చియ్య తదితరులు పాల్గొన్నారు.

## రైతు సేవా కేంద్రాల ద్వారా అపరాల కొనుగోలు

చెరుకుపల్లి, మార్చి7(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఏపీ మార్క్‌ఫెడ్, జాతీయ సంస్థ అయిన నాఫెడ్ ఎన్‌సీసీఎఫ్ తరుపున జిల్లాలో శనగలు మద్దతు ధర క్వింటాకు రూ.5,650, మినుములకు రూ.7,400, పెసలకు రూ.8,682 చొప్పున రైతుసేవా కేంద్రాలను ప్రధమ కొనుగోలు కేంద్రాలుగా గుర్తించి సొసైటీ ద్వారా అపరాలు కొనుగోలు చేయాలని జాయింట్ కలెక్టర్ నిర్ణయించారని ఎంఏవో ఎ.మహేష్‌బాబు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ క్రాప్‌లో ఈ పంటలను ఇప్పటికే నమోదు చేసుకున్న రైతులు తమ సమీపంలో ఉన్న రైతు సేవా కేంద్రాల వద్దకు వెళ్ళి తమ పేర్లను సీఎంఏపీలో నమోదు చేసుకోవాలన్నారు. ఇతర వివరాల కొరకు తమ సమీపంలోని రైతుసేవా కేంద్రాల వద్ద సంప్రదించాలని ఆయన కోరారు.

## పురుగుమందుల వినియోగంలో జాగ్రత్త వహించాలి

● వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.ప్రసూనారాణి



రైతులకు భద్రతా వస్త్రాలు అందజేస్తున్న వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.ప్రసూనారాణి

బాపట్ల, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : పురుగు మందుల వినియోగంలో రైతులు జాగ్రత్త వహించాలని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.ప్రసూనారాణి తెలిపారు. పొలాలలో పురుగుమందులను వెదజల్లే క్రమంలో రైతులు తప్పనిసరిగా వ్యక్తిగత భద్రతా వస్త్రాలను వేసుకోవాలన్నారు. వ్యవసాయ కళాశాల కీటక శాస్త్ర విభాగంలో పురుగుమందుల వినియోగ పద్ధతులు, వాటి సురక్షిత వాడకంపై శుక్రవారం శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అసోసియేట్ డీన్ మాట్లాడుతూ పురుగుమందులను క్రమపద్ధతిలో వినియోగిస్తే రైతు కుటుంబానికి భద్రత ఉంటుందన్నారు. శిక్షణ పొందిన రైతులకు వ్యక్తిగత భద్రత, రక్షణ భద్రత ప్రాంతం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎ ఎస్ట్ సిఇ ఇయక్ టీర్ నియోగ సమన్వయకర్త డాక్టర్ కె.సుశీల, రిసోర్స్‌పర్సన్ డాక్టర్ పి.సుధాజాకబ్, మూలపాలెం, మధ్యావారి పాలెం, బాపట్ల గ్రామానికి చెందిన రైతులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చుండూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : మోదుకూరు, పెనుగుడురుపాడు విద్యుత్ పీడర్ల పరిధిలోని గ్రామాలైన మోదుకూరు, చుండూరు, మున్నంగివారిపాలెం, వేటపాలెం, పెనుగుడురుపాడు పీడర్ గ్రామాలైన యడ్లపల్లి, వలివేరు, పెనుగుడురుపాడు, వియస్సంపాలెం గ్రామాల్లో విద్యుత్ లైన్లు మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 8 నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు రైతులు, గృహ వినియోగదారులు గమనించాలని ఏఈ ఆర్యరావు తెలిపారు.

● భట్టిప్రోలు (కొల్లూరు), మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : భట్టిప్రోలు సబ్ స్టేషన్ పరిధిలోని పల్లెకోన పీడర్ కింద వేమవరం, సూరేపల్లి, కోనేటిపురం, పల్లెకోన, రాచూరు, ఆక్కుమడి, పెదపులివర్రు పీడర్ కింద పెదపులివర్రు, గొరికపూడి, ఓలేరు, కన్నెగంటివారిపాలెం, తూర్పుపాలెం, పెసర్లంక పీడర్ కింద పెసర్లంక, పెదలంక గ్రామాల్లో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ శాఖ ఏఈ ఎం.శాంతకుమారి శుక్రవారం తెలిపారు.

## నిరుపేద మహిళలకు చీరలు పంపిణీ

కర్లపాలెం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : అబ్దుల్ కలాం ఫౌండేషన్, కర్లపాలెం ఆధ్వర్యంలో దుండుబాటలో 10 మంది నిరుపేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రెసిడెంట్, గ్రామ ఉప సర్పంచ్ పఠాన్ అహ్మద్ బాషా, షేక్ బాజి, పఠాన్ దిల్‌సారెడ్డి, బహదూర్ బాషా, షేక్ ఇబ్రహీం, షేక్ జానీబాషా, షేక్ మౌలాలీ తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు పంపిణీ



చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

భట్టిప్రోలు (కొల్లూరు), మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును శుక్రవారం ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పంపిణీ చేశారు. భట్టిప్రోలు మండలం రామారు గ్రామానికి చెందిన మల్లెల వజ్రకుమార్ లివర్ సంబంధిత వ్యాధితో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందారు. చికిత్స కోసం అయిన బిల్లును ఎమ్మెల్యేకు చూపించి ఆర్థిక సాయం కోరారు. స్పందించిన ఎమ్మెల్యే తన రిఫరెన్స్ లెటర్ ద్వారా సీఎంఆర్‌ఎఫ్ కార్యాలయానికి పంపారు. అక్కడ నుంచి మంజూరైన వచ్చిన రూ.1,00,182ల చెక్కును ఎమ్మెల్యే లబ్ధిదారుని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారుని కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబులకు కృతజ్ఞతలు తెలిపారు.

## 9న పాలిటెక్నిక్ కళాశాల ప్రారంభం



పాలిటెక్నిక్ కళాశాల భవనాన్ని పరిశీలిస్తున్న అనగాని శివప్రసాద్

రేపల్లె, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పది నెలల వ్యవధిలో పాలిటెక్నిక్ కళాశాల భవన పనులను రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రత్యేక దృష్టిసారించి నిలిచిన పనులు పూర్తి చేయించారని టీడీపీ సీనియర్ నాయకుడు అనగాని శివప్రసాద్ అన్నారు. పాలిటెక్నిక్ కళాశాల భవనం అభివృద్ధి పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 9వ తేదీన జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి కొలుసు పార్థసారథి, రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ పాలిటెక్నిక్ కళాశాల భవనాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. దానిలో భాగంగా కళాశాల పనులను పరిశీలించటం జరిగిందన్నారు. కళాశాల అభివృద్ధి పనులు పూర్తి స్థాయిలో అయిపోయాయని ఇన్నర్‌లో మొక్కలను నాటటం ఒక్కటే మిగిలిందన్నారు. కళాశాల అన్ని హంగులతో కూడిన నూతన భవనం పూర్తయిందని, రానున్న రోజుల్లో విద్యార్థులకు ఈ కళాశాల ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## పవన్ కల్యాణ్‌పై జగన్ వ్యాఖ్యలు సహించేది లేదు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న రాజేష్ తదితరులు

వేమూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సేవ చేయాలన్న దృక్పథంతో జనసేన పార్టీ ఏర్పాటు చేసి కూటమి పాలన ద్వారా ఉపముఖ్యమంత్రిగా అన్నివర్గాల ప్రజలకు సేవలు అందిస్తూ ప్రజల మన్ననలు అందుకుంటున్న పవన్ కళ్యాణ్‌పై మాజీ ముఖ్యమంత్రి జగన్ అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని సహించేది లేదని నియోజకవర్గ సమన్వయకర్త ఊసా రాజేష్ హెచ్చరించారు. చావలిలో శుక్రవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ, ఒక్క ఛాన్స్ అంటూ ప్రజలను మభ్యపెట్టి ముఖ్యమంత్రి పదవిని అలంకరించి ప్రజా ఆకాంక్షలను ఛిద్రం చేసిన జగన్‌కు పవన్‌ను విమర్శించే హక్కు ఎక్కడిది అని ప్రశ్నించారు. ఐదు సంవత్సరాల కాలంలో ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా అరాచక పాలన సాగించిన జగన్‌కు ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారు. ఇప్పటికైనా విమర్శలు మానుకోవాలని హితవు పలికారు. ఈ సమావేశంలో చావలి గ్రామ సర్పంచ్ చిమ్ముముత్తల శ్రీనివాసరావు, పలువురు జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జనసేనలో చేరిన దమ్మనవారిపాలెం సర్పంచ్



వెంకటేశ్వర్లును పార్టీలోకి ఆహ్వానిస్తున్న మార్కండేయులు బాబు, అరుణ

కర్లపాలెం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దమ్మనవారిపాలెం గ్రామ సర్పంచ్ గుర్రపుసాల వెంకటేశ్వరరావు, కొత్త వెంకటేశ్వరరావు (జగ్గయ్య)లు శుక్రవారం జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి వడ్రాణం మార్కండేయులుబాబు, రాష్ట్ర నాయకురాలు రాయపాటి అరుణ సమక్షంలో సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ ఆధ్వర్యంలో జనసేన పార్టీలో చేరారు. మార్కండేయులుబాబు, అరుణలు వెంకటేశ్వరరావుకు జనసేన పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్‌కళ్యాణ్ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై జనసేన పార్టీలో చేరానని, పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని సర్పంచ్ వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో నామన వెంకట శివన్నారాయణ, గుంటుపల్లి తులసీకుమార్, గొట్టిపాటి శ్రీకృష్ణ, ఇమ్మడిశెట్టి మురళీకృష్ణ, చిలకల సురేంద్రబాబు, జనసేన పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వేతనాలు చెల్లించాలని పంచాయతీ కార్మికుల ఆందోళన



ఆందోళన చేస్తున్న పారిశుధ్య కార్మికులు

వేమూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : వేమూరు గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులకు జనవరి, ఫిబ్రవరి మాసాల వేతనాలు చెల్లించకుండా తాత్కారం చేస్తున్నారంటూ శుక్రవారం పంచాయతీ కార్యాలయం ముందు పారిశుధ్య కార్మికులు ఆందోళనకు దిగారు. తమకు అందించాల్సిన దుస్తులు, కొబ్బరినూనె వంటి సౌకర్యాలు ఆరునెలల సంవత్సరాలుగా అందించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాలు అందించే వరకు తాము విధులకు హాజరుకామని పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం తాగునీటి కుళాయిలను కూడా వీరు అందించకపోవడంతో తాగునీటి కోసం గ్రామస్తులు ఇబ్బందులు పడ్డారు.

## మోసపూరిత వాగ్దానాలతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం : సీపీఎం

కొల్లూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : మోసపూరిత వాగ్దానాలతో కూటమి ప్రభుత్వం గద్దెనెక్కిందని సీపీఎం జిల్లా కార్యదర్శి గంగయ్య ఆరోపించారు. కొల్లూరులోని ప్రజా సంఘాల కార్యాలయంలో శుక్రవారం ఆ పార్టీ మండల కమిటీ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ కొల్లూరు మండలం పరిధిలోని గ్రామాల్లోని ఇసుక రీచ్‌ల్లో కూలీలతో కాకుండా యంత్రాలతో ఇసుక లోడింగ్ చేస్తున్నారని, తద్వారా కూలీలకు జీవనోపాధి కరువైందన్నారు. ప్రభుత్వ అధికారులు స్పందించి ఇసుక క్వారీల్లో కూలీలతోనే ఇసుక లోడింగ్ చేయించాలని డిమాండ్ చేశారు. అలాగే ఉపాధి హామీ పథకం పనులు కూడా అన్ని గ్రామాల్లో ప్రారంభించాలన్నారు. ఈనెల 8 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించే ప్రచార యాత్రను ప్రజలు, కార్మిక, కర్షక సంఘాలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు టీకృష్ణమోహన్, కార్యదర్శి వేములపల్లి వెంకట్రామయ్య, కమిటీ సభ్యులు టి.నాగమల్లేశ్వరరావు, తోడేటి సురేష్, సుబ్బారావు పాల్గొన్నారు.

## ప్రత్యేక అవసరాల చిన్నారులపై మరింత శ్రద్ధ అవసరం

చుండూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : ప్రత్యేక అవసరాల చిన్నారుల శారీరక, మానసిక వికాసానికి నిత్యం మరింత శ్రద్ధతో సేవలు అందించాలని భవిత కేంద్రాల జిల్లా సమన్వయకర్త ఎం.జ్యోత్స్న తెలిపారు. మున్నంగివారిపాలెం భవిత కేంద్రాన్ని శుక్రవారం ఆమె ఆకస్మికంగా పరిశీలించారు. ఈ చిన్నారుల తల్లిదండ్రులు తమ బిడ్డలకు ఇక్కడ ఫిజియోథెరపీ క్యాంపులు, మానసిక వికాసం కోసం అందిస్తున్న కోర్సులు వినియోగించుకొని విశేషంగా శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రత్యేక అవసరాల చిన్నారులను త్వరగా సమాజంలో నలుగురితో కలిసిపోయే విధంగా దిద్దడానికి ప్రభుత్వం ఈ ప్రత్యేక శిక్షణ కేంద్రాలను వినియోగించుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్‌పీలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# అన్నింటా.. ఆమె



● సేవ నుంచి సమరం వరకు సబలలు
● ఎందరికో స్ఫూర్తిగా మారి అద్భుతాలు సృష్టి

సగటు మహిళ.. అద్భుతాలు సృష్టిస్తోంది. అబల అని పక్కన పెట్టకుండా ప్రోత్సహిస్తే అందరికీ ఆదర్శప్రాయంగా, స్ఫూర్తిగా నిలుస్తామని మహిళలు నిరూపిస్తున్నారు. తమ నేపథ్యం పట్టణం.. మారుమూల పల్లె అన్న తేడా లేకుండా మహిళలు అత్యున్నత శిఖరాలు అధిరోహిస్తున్నారు. కుటుంబాన్ని చక్కదిద్దు కోవడమే కాకుండా సమాజాన్ని కూడా సరి చేస్తున్నారు. ఇలాంటి ఎందరో మహిళలు ఉన్నారు. వారిలో కొందరి గురించి తెలుసుకుందాం..

## వైద్యం.. సేవలో స్ఫూర్తి

● క్యాన్సర్ రహిత తెనాలి కోసం డాక్టర్ శారద కృషి



డాక్టర్ శారద



ఉచిత వైద్య శిబిరం వద్ద బారులుతీరిన జనం (ఫైల్)

తెనాలి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): తెనాలికి చెందిన డాక్టర్ శారద అందరిలా వృత్తికే పరిమితం కాలేదు. 1993లో వైద్య వృత్తి చేపట్టిన ఆమె వృత్తిని వ్యాపారంగా కాకుండా సేవా స్ఫూర్తితో నిర్వహిస్తున్నారు. శారద సర్వీసెస్ సొసైటీని స్థాపించి అనేక సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. మహిళగా సాటి మహిళల కష్టాలు తీర్చడానికి కృషి చేస్తున్నారు. కరోనా సమయంలో రోగుల ఇళ్లకే వెళ్లి వైద్యసేవలందించడం దగ్గర నుంచి మహిళకు వచ్చే సంక్రమిత వ్యాధులపై అవగాహన కల్పించడం, క్యాన్సర్ రహిత తెనాలిగా మార్చేందుకు కృషి చేస్తున్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ఉచితంగా మొక్కలనూ పంపిణీ చేస్తున్నారు. వారంవారం ఉచిత వైద్యసేవలతో పాటు రోగులకు మందులు కూడా అందిస్తున్నారు. కరోనా సమయంలో వైద్యులకు యాప్రాన్లు, మాస్కుల కొరత ఉండటంతో తెనాలిలోనే వాటిని తయారుచేయించి ప్రభుత్వానికి అందించారు. పీపీఈ కిట్లను రాష్ట్రంలోని అన్ని వైద్యశాలలకు అవకాశం ఉన్నంత వరకు ఆమె అందించగలిగారు. కరోనా రెండో దశలో రోగుల ఇళ్లకు వెళ్లి చికిత్సలతో పాటు ఆక్సిజన్ కిట్లను కూడా అందజేశారు. కరోనా మహమ్మారి శాంతించాక మహిళల్లో సంక్రమణ వ్యాధుల నియంత్రణపై దృష్టి పెట్టారు. మహిళలల్లో సంక్రమణ వ్యాధులైన షుగర్, బీపీ, థైరాయిడ్, క్యాన్సర్ తదితర ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ పొందడం ఎలా అనే విషయాలపై తెనాలిలోని పలు కాలనీలను దత్తత తీసుకుని చైతన్యం తీసుకొచ్చేందుకు కృషి చేశారు. ప్రభుత్వ వైద్యశాల సహకారంతో మహిళలకు అవసరమైన పరీక్షలు, స్కానింగ్ చేయించగలిగారు. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నుంచి మహిళలను రక్షించేలా నడుం బిగించారు. తెనాలిలో శిబిరాల ద్వారా 3,600మందికి పాప్‌స్మియర్ పరీక్షలు ఉచితంగా చేయించారు. రూ.3200 ఖరీదయ్యే క్యాన్సర్ నివారణ వ్యాక్సిన్లను ఆమె తన సొసైటీ ద్వారా ఉచితంగా 122 మంది రోగులకు అందించారు. ఆమె సేవలకు గుర్తుగా అప్పటి ముఖ్యమంత్రి రోశయ్య వంటి ప్రముఖుల నుంచి ప్రశంసలు, పురస్కారాలు పొందారు. ఇంతటి సేవలందిస్తున్న డాక్టర్ శారద మిగిలిన వారికి స్ఫూరిదాయకమే.

## అనాథల విద్యాలయంగా.. చేతన

● మదర్‌థెరిస్సా స్ఫూర్తితో డాక్టర్ మంగాదేవి



మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాంతో మంగాదేవి

గుంటూరు(విద్య), మార్చి 7(ఆంధ్రజ్యోతి): డాక్టర్ నన్నపనేని మంగాదేవి.. అనాథ పిల్లలంటే అంతులేని ప్రేమ. వారికోసం ఏదైనా చేయాలనే సంకల్పం ఆమెది. ఆ సంకల్పానికి స్ఫూర్తి మదర్‌థెరిస్సా. యాభైనాలుగేళ్ల క్రితం 1970వ దశకంలో మదర్‌థెరిస్సా గుంటూరు బ్రాడీపేటలోని బాలకుటీర్‌ను సందర్శించారు. 'చిన్నారుల కోసం పాఠశాల నిర్వహిస్తున్నారు.. అనాథ పిల్లల కోసం కూడా ఏదైనా చేయగలరేమో ఆలోచించండి.. అని మదర్‌థెరిస్సా డాక్టర్ మంగాదేవికి సూచించారు. దీంతో 'చేతన' నిర్మాణానికి డాక్టర్ మంగాదేవి శ్రీకారం చుట్టారు. అనాథ పిల్లల కోసం చేతన ఆధ్వర్యంలో 1990 జూలైలో ప్రత్యేకంగా పాఠశాలను ఏర్పాటు చేశారు. వందల మంది విద్యార్థులను అక్కున చేర్చుకుని విద్యాబుద్ధులు చెప్పే దేవాలయంగా చేతనను మార్చారు. ఉచితవిద్య, వసతితోపాటు భోజనం, దుస్తులను ఇక్కడ అనాథ పిల్లలకు అందిస్తారు. 'చేతన'లో విద్యార్థులు చదువుతోపాటు క్రీడలు, సాంస్కృతిక, కళ, వైజ్ఞానిక రంగాల్లో రాణించేలా తీర్చిదిద్దుతారు. చౌడవరం సమీపంలోని కొండరాళ్లు కొట్టి పొట్టపోసుకుంటున్న కుటుంబాల పిల్లలకు కూడా చేతన ద్వారా చేయూత ఇస్తున్నారు. చేతన అండతో వారంతా ఇంజనీర్లు, డాక్టర్లుగా మారి తమ కుటుంబాల్లో వెలుగులు నింపారు.



## సబలల సమరం

● చారిత్రాత్మక విజయంగా అమరావతి పోరు
● ఇంటి పని చేసుకుంటూనే ఐదేళ్లు ధీరోదాత్త పోరాటం

గుంటూరు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): అప్పటి వరకు ఆ మహిళలు ఇళ్లకే పరిమితం. ఇళ్లలో లేదంటే వ్యవసాయ పనుల్లోనే నిమగ్నం. అలాంటి వారు ఆంధ్రుల కలల రాజధాని కోసం ఐదేళ్ల ధీరోదాత్త పోరాటం చేశారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఆయువు కోల్పోయే దయనీయ స్థితి నుంచి అమరావతిని రక్షించుకున్నారు. పోలీసుల దౌర్జన్యాలు, లాఠీచార్జీలు.. కేసులు.. దాడులు.. అధికారం.. అవమానాలు.. కుట్రలెన్నింటినో ఎదుర్కొని ఐదేళ్ల పోరాటం చేసి అమరావతిని రాజధాని గ్రామాల మహిళలు అజరామరం చేశారు. సాధారణ గృహిణులుగా ఉండే మహిళలు ఉద్యమబాట పట్టి అసాధారణ వీర వనితలుగా ఎదిగారు. కుల, మతాలకు అతీతంగా సాగిన వారి పోరాటంతో నవ్యాంధ్ర కలల రాజధాని తిరిగి పునర్జీవం పోసుకుంది. ఎందరో వీరవనితలు బయటి ప్రపంచానికి తెలియకుండా ఉద్యమానికి ఊపిరులూదారు. వారికి ప్రతీకలుగా ఒకరిద్దరి గురించి..



### వెనకడుగు వేయలేదు

వెలగపూడి గ్రామానికి చెందిన షేక్ వహీదా రెహమాన్. రాజధాని కోసం ఎకరన్నర పొలం ఇచ్చారు. దంపతులిద్దరూ ఉద్యమంలో ముందుండేవారు. కరోనా సోకి భర్త హిమాంసాహెబ్ చనిపోయారు. అయినా రెహమాన్ వెనకడుగు వేయలేదు. బిడ్డలను చదివించుకుంటూనే రాజధానిపై జరుగుతున్న కుట్రలకు వ్యతిరేకంగా రోడ్డెక్కారు. క్షేత్రస్థాయిలో మహిళలను కదిలించి ఉద్యమాన్ని పదునెక్కించారు. ఐదేళ్లపాటూ ఉద్యమాన్ని అగ్రపథాన నిలిపి కొనసాగించారు.

### దళిత జేఏసీ నేతగా

తుళ్లూరు గ్రామానికి చెందిన అంకం సువర్ణ కమల దళిత మహిళ. సాధారణ కుటుంబ నేపథ్యం నుంచి వచ్చి ఉద్యమ నేతగా ఎదిగారు. అమరావతి దళిత జేఏసీ నేతగా ఎదిగారు. దళితవాడల్లో చైతన్యాన్ని రగుల్కొల్పి అమరావతి ఉద్యమ అగ్రభాగాన వారిని నిలపడంలో ఆమె కీలకంగా నిలిచారు. పాదయాత్రలో నడిచి తమ త్యాగాలను ప్రపంచానికి చాటారు.



### ఎంతోమందికి స్ఫూర్తి

వెలగపూడికి చెందిన రైతు కూలీ రావి గంగాపార్వతి. రాజధాని కోసం ఇవ్వడానికి సెంటు భూమి కూడా లేని నిరుపేదరాలు. వయసులో పెద్దవారు కూడా. అయినా రాజధానిపై జరుగుతున్న కుట్రలతో చలించిపోయారు. భూములిచ్చిన రైతులు.. తనకు పని ఇచ్చిన అన్నదాతలకు జరుగుతున్న అన్యాయాన్ని తనకు జరుగుతున్న అన్యాయంగా భావించి ఆమె ఉద్యమంలోకి వచ్చారు. ఇలా వచ్చి అలా వెళ్లడం కాదు.. ఐదేళ్లపాటు ఉద్యమంలోనే కొనసాగారు. ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచారు.



### మహిళలను చైతన్యవంతం

తుళ్లూరు గ్రామానికి చెందిన అరుణ. ఆమె కటుంబం రాజధాని కోసం రెండెకరాలు పొలం ఇచ్చారు. రాజధానిపై జరిగిన కుట్రల నేపథ్యంలో ఆమె ఉద్యమంలోకి వచ్చారు. సాధారణ గృహిణిగా ఉన్న ఆమె ఉద్యమ ప్రభావంతో చైతన్యం పొందారు. ఎందరో మహిళలను చైతన్యవంతం చేసి ఉద్యమంలోకి తీసుకువచ్చారు.



## నారీ సారథ్యం

● కీలకమైన 16 ప్రభుత్వ శాఖలకు నాయకత్వం

గుంటూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గుంటూరు జిల్లాలో గతంలో ఎన్నడూలేనట్లుగా మహిళా అధికారులకు కీలక బాధ్యతలు లభించాయి. అమరావతి రాజధాని కలిగిన కీలకమైన గుంటూరు జిల్లా బాధ్యతలను మహిళా అధికారులైతేనే సమర్థవంతంగా నిర్వహిస్తారన్న భావనతో ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం తీసుకున్నది. పరిపాలనపరంగా జిల్లాను ముందుకు నడిపించే గుంటూరు జిల్లా కలెక్టర్ బాధ్యతను ఇంచుమించుగా రెండు దశాబ్దాల తర్వాత మహిళకు దక్కింది. కలెక్టర్‌గా ఎస్ నాగలక్ష్మీ ప్రభుత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలుపుకుంటూ అనేక అభివృద్ధి పనులను పూర్తి చేయిస్తున్నారు. ఇటీవలే ఉమ్మడి కృష్ణా - గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను ఎలాంటి వివాదాలకు తావు లేకుండా నిర్వహించి ప్రశంసలందుకున్నారు. జిల్లా లో వివిధ ప్రభుత్వ శాఖలకు మహిళా అధికారులే నాయకత్వం వహిస్తున్నారు. తెనాలి సబ్ కలెక్టర్‌గా వీ సంజనసిన్హా, గుంటూరు జిల్లా రిజిస్ట్రార్‌గా డీ శైలజ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిగా డాక్టర్ విజయలక్ష్మి, అదనపు ఎస్పీగా సుప్రజ, జిల్లా విద్యా శాఖ అధికారిగా రేణుక, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీగా విజయలక్ష్మి, జిల్లా పరిశ్రమల మేనేజర్‌గా జయలక్ష్మి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా దుర్గాబాయి, మహిళ అభివృద్ధి శిశు సంక్షేమశాఖ పీడీగా ఉమాదేవి, మెప్మా పీడీగా విజయలక్ష్మి, బీసీ సంక్షేమ అధికారిగా కే మయూరి, ఆసియా ఖండంలోనే అతి పెద్ద మిర్చి వాణిజ్య కేంద్రమైన గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీకి ఉన్నతశ్రేణి కార్యదర్శిగా చంద్రిక, మార్కెటింగ్ శాఖ డీడీగా జాన్సీరాణి, విభిన్న ప్రతిభావంతులు సంక్షేమ శాఖ ఏడీగా సువార్త, పౌరసరఫరాల శాఖ అధికారిగా కోమలి పద్మ, జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్‌గా లక్ష్మితో పాటు మరికొన్ని శాఖలకు కూడా మహిళ అధికారులే బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

### ప్రజాప్రతినిధులుగా..

ఉమ్మడి గుంటూరు జడ్పీ చైర్‌పర్సన్‌గా కత్తెర హెనీక్రిస్టీనా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మూడు జిల్లాల ప్రజాప్రతినిధులు, అధికారులను సమన్వయం చేసుకుంటూ ఆమె జడ్పీని పురోభివృద్ధిలోకి తీసుకెళుతున్నారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యేగా గల్లా మాధవిని గెలిపించిని టీడీపీ కూటమి అటు అధికారయంత్రాంగం, ఇటు పరిపాలనపరంగా మహిళలకు అగ్రతాంబూలాన్ని ఇచ్చింది.

## హెచ్‌ఐవీ బాధితులకు షిప్ బాసట

● 20 ఏళ్లుగా బాధితురాలు రమాదేవి ప్రస్థానం



ప్రశంసాపత్రం అందుకుంటున్న రమాదేవి

గుంటూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): చిన్న వయసులోనే భర్త హెచ్‌ఐవీతో మృతి చెందగా.. బాధిత మహిళ అన్న కనికరం కూడా లేకుండా అయిన వాళ్ల అవమానాలు.. చీత్కారాలతో ఆమె కుంగిపోలేదు. వాటిని అధిగమించి.. బాధిత మహిళగా 20 ఏళ్లుగా హెచ్‌ఐవీ రోగుల సేవలో తరిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. అవమానాలనే సోపానాలుగా చేసుకుని తనలాంటి ఎందరికో అండగా నిలిచి వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్నారు. ఆమె పేరే.. 'షిప్ రమాదేవి'. హెచ్‌ఐవీ బాధితుల కోసం సొసైటీ వెల్ఫేర్ హెచ్‌ఐవీ ఇన్‌ఫెక్టెడ్ పీపుల్(ఎస్‌హెచ్‌ఐపీ- షిప్) సంస్థను ఏర్పాటు చేసి ఎందరో బాధితులకు అండగా నిలిచారు. అటు అత్తింటివారు.. ఇటు పుట్టింటివారు ఎవరూ ఆదరించని దయనీయ పరిస్థితిలో జీవితాన్ని సవాలుగా తీసుకున్న గుంటూరుకు చెందిన రమాదేవి 2003లో తన ప్రస్థానాన్ని ప్రారంభించింది. తన గుర్తింపును ప్రపంచానికి పరిచయం చేసి తనలాంటి ఎంతోమంది బాధితులకు ఆమె గుండె ధైర్యంగా మారారు. హెచ్‌ఐవీ బాధిత మహిళలను సమాజం చిన్నచూపు చూడడాన్ని సవాలుగా స్వీకరించిన రమాదేవి బాధిత మహిళలను చేరదీసి వారికి అండగా నిలుస్తున్నారు. ఏడుగురు మహిళలతో ఏర్పాటు చేసిన షిప్ సొసైటీ నేడు 15వేల మందికి ఆసరాగా నిలిచే స్థాయికి ఎదిగింది. మహిళలు 7,287, పురుషలు 6,478, ట్రాన్స్ జెండర్లు 21 మంది, బాలురు 196, బాలికలు 172 మందికి షిప్ అండగా ఉంటోంది. హెచ్‌ఐవీ అనేది బీపీ, సుగర్‌లాంటి దీర్ఘకాలిక అనారోగ్యమే తప్ప.. ఆందోళన పడాల్సింది ఏమీ లేదని.. దాన్ని చైతన్యంతో జయించవచ్చని నిరూపించి సమాజానికి ఒక పాఠం నేర్పింది. సొంత కుటుంబాల నుంచి ఎదురయ్యే అవమానాలను ఎదుర్కొనే చైతన్యాన్ని బాధిత మహిళలకు వేల సంఖ్యలో కౌన్సెలింగ్‌లు నిర్వహించారు. వంశ పారంపర్యంగా వారికి హక్కుగా రావాల్సిన ప్రయోజనాలను కూడా కుటుంబ సభ్యులు కాదు పొమ్మంటే.. ఆ హక్కుల సాధనకు వారికి చేయూతగా నిలిచారు. హెచ్‌ఐవీని ఎదుర్కొన్న వారి జీవిత కాలాన్ని పెంపొందించేందుకు కావాల్సిన వైద్య సహాయాన్ని ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ద్వారా అందిస్తున్నారు. గుంటూరు జీజీహెచ్, మంగళగిరి, గోరంట్ల ఐడీహెచ్‌సీలో ఉన్న ఏంటీ రిట్రోవైరల్ థెరపీ(ఏఆర్టీ) సెంటర్లతో కలిసి వైద్య సదుపాయాలు బాధితులకు అందుబాటులోకి తెస్తున్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టే వివిధ కార్యక్రమాలతో అనుసంధానం చేసుకుని బాధితులకు అనేక రూపాల్లో అండదండలు అందించడంతోపాటు, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తూ వస్తున్నారు. ఆమె స్ఫూర్తితో 26 జిల్లాల్లో హెచ్‌ఐవీ బాధితులకు అండగా నిలిచే ఇలాంటి సొసైటీలు ఎన్నో ఏర్పడ్డాయి. ప్రభుత్వ సంస్థలు, ఆశ గ్రూపులతో కలిసి బాధిత చిన్నారులను గుర్తించడం, వారికి కావాల్సిన ప్రయోజనాలను అందించడం కోసం షిప్ కృషి చేస్తోంది. హెచ్‌ఐవీ బాధితులు సమాజానికి సమస్య కాదు.. వారే ఈ సమస్యకు పరిష్కారం అన్న మోటివ్‌తో పనిచేసే 'షిప్' రెండు దశాబ్దాల ప్రస్థానంలో రమాదేవి, షిప్ సంస్థకు ఎన్నో అవార్డులు, రివార్డులు వచ్చాయి.

## బెస్ట్ ఫిషర్‌గా అనంత విజయ

● బెస్తపాలెం నుంచి ఎదిగిన పారిశ్రామికవేత్త





మహిళా పారిశ్రామిక వేత్త అనంతవిజయకు బెస్ట్ ఫిషర్ ఎంటర్‌ప్రైజర్ అవార్డు అందజేస్తున్న మత్స్యశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు, మంత్రి కొల్లు రవీంద్ర తదితరులు (ఫైల్‌ఫొటో)

బాపట్ల, మార్చి 7(ఆంధ్రజ్యోతి): దేశంలో 462 హేచరీలు ఉన్నాయి. అయితే ఓ మహిళ ఆధ్వర్యంలోనూ హేచరీలు ఉన్నాయంటే ఆశ్చర్య పోవాల్సింది. అయితే అందరినీ ఆశ్చర్య పరచడమే కాకుండా ఎందరో ప్రముఖుల నుంచి ప్రశంసలు అందుకుంటున్నారు.. బాపట్ల పట్టణంలోని బెస్తపాలేనికి చెందిన మత్స్యకార మహిళ అనంత విజయ. మత్స్యకార కుటుంబంలో పుట్టిన ఆమె ఆక్వా పరిశ్రమలో రాణిస్తున్న తీరు ఎందరికో ఆదర్శప్రాయంగా మారింది. బాపట్ల మండలం ధరివాదకొత్తపాలెంలో లక్షిత బయో రిసోర్సెస్, అన్నవరంలో లాలిత్య హెచరీస్ పరిశ్రమలను ఆమె నిర్వహిస్తున్నారు. హెచరీలో వనామి రొయ్యపిల్లలను ఉత్పత్తి చేస్తుండగా బయో రిసోర్సెస్ మందు ఫిష్ బ్రీడింగ్, అలంకరణ చేపల బ్రీడింగ్ తయారు చేస్తున్నారు. వీటి ద్వారా అనేకమందికి ఉపాధి కల్పిస్తున్నారు. ఏడాదికి రూ.1.8 కోట్ల టర్నోవర్ చేస్తున్నారు. బాపట్లలో స్కిల్ కాలేజి నిర్వహిస్తూ యువతలో నైపుణ్యాలు పెంపొందించేందుకు కూడా ఆమె కృషి చేస్తున్నారు. రాబోయే రోజుల్లో అలంకరణ చేపల బ్రీడింగ్‌ను మలేషియా, సింగపూర్, అమెరికా వంటి దేశాలకు పంపించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఆమె ప్రతిభను గుర్తించి ఇటీవల ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా మంత్రులు కె.అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర బెస్ట్ ఫిషర్ ఎంటర్‌ప్రైజర్ అవార్డు ఇచ్చారు. న్యూఢిల్లీకి చెందిన ఆలిండియా ఫిషర్మెన్ మెగా కన్వెన్షన్ కానిస్టిషనల్ క్లబ్ బెస్ట్ ఫిసర్ ఉమెన్ ఎంటర్‌ప్రైజర్ అవార్డుతో సత్కరించింది.

## ఇస్రోను చూద్దాం రండి!



● తొమ్మిదో తరగతి విద్యార్థులకు ఆహ్వానం
● యువ విజ్ఞాన కార్యక్రమంలో పాల్గొనేందుకు ప్రోత్సాహం
● ఈ నెల 23లోగా దరఖాస్తు చేసుకోవాలి
● అన్ని వసతులు ఉచితమే..

గుంటూరు (విద్య), మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పాఠశాల స్థాయిలో 9వ తరగతి విద్యార్థుల్లో అంతరిక్ష విజ్ఞానంపై అవగాహన, ఆసక్తి పెంపొందించేందుకు, భవిష్యత్తులో వారు అంతరిక్ష పరిశోధనల వైపు మొగ్గు చూపేలా ప్రోత్సహించేందుకు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ప్రత్యేక కార్యక్రమం 'యు.వి.కా' నిర్వహిస్తుంది. ఇస్రో నిర్వహించే యువ విజ్ఞాన కార్యక్రమం (యు.వి.కా)లో పాల్గొనేలా ప్రోత్సహిస్తూ దరఖాస్తులు ఆహ్వానిస్తుంది. యు.వి.కా. కార్యక్రమాలకు సంబంధించి ఇప్పటికే ఇస్రో పాఠశాల స్థాయిలో విద్యార్థులకు ఆహ్వానాలు పంపింది. విద్యార్థులను ప్రోత్సహించేలా ప్రధానోపాధ్యాయులు, సైన్స్ ఉపాధ్యాయులు, డీఈవో, డీవైఈవో, ఎంఈవో, జిల్లా సైన్స్ కోఆర్డినేటర్‌కు సమాచారం పంపింది. 9వ తరగతి విద్యార్థులు ఇందులో పాల్గొనేలా ప్రోత్సహిస్తోంది. ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలల్లో దాదాపు 90వేల మంది విద్యార్థులు ఉన్నారు. వారిలో ప్రతిభావంతులను ఎంపిక చేసే కార్యక్రమం ఇస్రో చేపడుతుంది.

### ఎలా పాల్గొనాలి....

అంతరిక్ష పరిశోధనలపై ఆసక్తి ఉన్న 9వ తరగతి విద్యార్థులు ఈ నెల 23 లోగా www.isro.gov.in వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని దరఖాస్తులు పంపాలి. ఎంపికైన విద్యార్థుల జాబితాను ఏప్రిల్ 7వ తేదీలోగా ఇస్రో ప్రకటిస్తుంది. మే 19 నుంచి 30వ తేదీ వరకు యు.వి.కా కార్యక్రమం ఉంటుంది. మే 31న కార్యక్రమం ముగుస్తుంది.

### ఎక్కడెక్కడ నిర్వహిస్తారు..

యు.వి.కా కార్యక్రమాలు ఇస్రో ఆధ్వర్యంలో రాష్ట్రంలోని నెల్లూరు జిల్లా శ్రీహరికోటతోపాటు దేశంలోని ఏడు కేంద్రాల్లో నిర్వహిస్తారు. డెహ్రాడూన్ (ఉత్తరాఖండ్), తిరువనంతపురం (కేరళ), బెంగళూరు (కర్ణాటక), షిల్లాంగ్ (మేఘాలయ), హైదరాబాద్ (తెలంగాణ), అహ్మదాబాద్ (గుజరాత్) తదితర ప్రాంతాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తుంది.

### వీరికి ప్రాధాన్యం..

ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు కార్పొరేట్ స్కూల్లో 9వ తరగతి చదివే విద్యార్థుల్లో అత్యంత ప్రతిభావంతులైన వారికి, అంతరిక్ష విజ్ఞానంపై ఆసక్తి ఉన్నవారిని ఎంపిక చేస్తారు. ఇందులో భాగంగా ఎనిమిదో తరగతిలో విద్యార్థులు సాధించిన మార్కులకు 50 శాతం, గ్రామీణ విద్యార్థులకు 15 శాతం, సైన్స్ ప్రదర్శనలో ప్రతిభచూపిన వారికి 10శాతం వెయిటేజ్ ఇస్తారు. ఇంకా క్రీడలు, ఒలింపియాడ్, ఎన్‌సీసీ, స్కౌట్ అండ్ గైడ్ విద్యార్థులకు ఐదు శాతం వెయిటేజీ కల్పిస్తుంది.

### రవాణా, వసతి, భోజనం ఉచితమే..

ఎంపికైన విద్యార్థులను ఇస్రో కేంద్రాలకు తీసుకెళ్తారు. అక్కడ శాస్త్రవేత్తలతో ముఖాముఖి మాట్లాడే అవకాశం కల్పిస్తారు. తమ సందేహాలను నివృత్తి చేసుకునేలా ఏర్పాటు చేస్తారు. అంతేకాకుండా ఇస్రోలో వింతలు, విశేషాలు తెలియజేయడంతోపాటు రాకెట్ ప్రయోగాలు, వాటి పనితీరు, వాటి వలన సమాజానికి కలిగే ఉపయోగాలు తదితర విషయాలను వివరిస్తారు. ప్రయాణ, భోజనం, ఇతర అన్ని సౌకర్యాలను ఇస్రో ఉచితంగానే కల్పిస్తుంది. దీనిని సద్వినియోగం చేసుకోవాలని డీఈవో సీవీ రేణుక, జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ గౌసుల్ మీరా విజ్ఞప్తి చేస్తున్నారు.

## క్షేత్ర పాలకుడే వాహనుడై...



హనుమంత వాహనంపై గ్రామోత్సవానికి విచ్చేసిన శ్రీలక్ష్మీనృసింహస్వామి, శ్రీవారిని దర్శించుకుంటున్న భక్తులు



● శ్రీవారి వాహన సేవలు ప్రారంభం

మంగళగిరి సిటీ, మార్చి 7: వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళాద్రి శ్రీలక్ష్మీనృసింహస్వామి వారు శుక్రవారం రాత్రి హనుమంత వాహనంపై భక్తులకు కనువిందు చేశారు. శ్రీవారి ప్రధాన వాహన సేవలు శుక్రవారం నుంచి ఆరంభమయ్యాయి. మంగళగిరికి క్షేత్ర పాలకునిగా చెప్పబడుచున్న భక్తాగ్రేశ్వరుడైన హనుమంతునికి స్వామివారి వాహన సేవల్లో తొలి ప్రాధాన్యతను కల్పించారు. అభయ ప్రదాన అయిన హనుమంతుని భుజ స్కంధములపై శ్రీదేవీ, భూదేవీ సమేతుడైన శ్రీలక్ష్మీనృసింహ స్వామి వారు గ్రామోత్సవానికి విచ్చేసి భక్తులను అలరించారు. దేవస్థానం వద్ద నుంచి ప్రారంభమైన గ్రామోత్సవం మెయిన్ బజారు మీదుగా మిద్దె సెంటరును చేరుకుని తిరిగి అదే మార్గంలో ఆలయానికి విచ్చేసింది. భక్తులు టెంకాయలు సమర్పించి స్వామివారిని శరణు వేడారు. ఈ ఉత్సవానికి పెదపాలెం వాస్తవ్యులు వాసిరెడ్డి మల్లేశ్వరరావు (రాజేష్) కైంకర్యపరులుగా వ్యవహరించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎ.రామకోటిరెడ్డి, అర్చకస్వాములు ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా వాసిరెడ్డి వేంకటాద్రినాయుడు కళా వేదికలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

## కామన్ పీజీ సెట్ రద్దు చేయాలని ధర్నా

మంగళగిరి సిటీ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): విశ్వవిద్యాలయాల్లో కామన్ పీజీ ప్రవేశ పరీక్షలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత విద్యార్థి సమాఖ్య రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో శుక్రవారం మంగళగిరిలోని ఉన్నత విద్యా మండలి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బందెల నాసర్‌జీ మాట్లాడుతూ గత ప్రభుత్వం పీజీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ విధానం తీసుకురావడంతో విశ్వవిద్యాలయాల్లో చేరే విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయిందన్నారు. యువగళం పాదయాత్రలో మంత్రి నారా లోకేశ్ తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కామన్ పీజీ ఎంట్రన్స్ ప్రవేశ పరీక్షను రద్దు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. కామన్ సెట్ వలన విద్యార్థులు తమకు ఇష్టమైన విశ్వవిద్యాలయాల్లో చేరలేక, వేరే జిల్లాల్లో సీటు వస్తే అక్కడకు వెళ్లలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. జీవో నెంబర్ 77 తీసుకురావడం వలన కేవలం ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో చదువుతున్న విద్యార్థులకు మాత్రమే ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తిస్తుందని, దీనివలన ప్రైవేటు కళాశాలల్లో చదివే విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో వుంచుకుని కామన్ పీజీ ప్రవేశ పరీక్షల విధానాన్ని రద్దుచేయాలని, డిగ్రీ ఆన్‌లైన్ విద్యావిధానం, జీవో నెం.77ను రద్దు చేయాలని, ఖాళీగా వున్న ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శులు మస్తాన్, నాగభూషణం, ఉపాధ్యక్షుడు సాయికుమార్, యశ్వంత్ శివ, సాధిక్‌బాబు, నాసరయ్య తదితరులు పాల్గొన్నారు.





ఉన్నత విద్యా మండలి కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నేతలు



మహిళా పారిశ్రామిక వేత్త అనంత విజయకు బెస్ట్ ఫిషర్ ఎంటర్‌ప్రైజర్ అవార్డు అందజేస్తున్న మత్స్యశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు, మంత్రి కొల్లు రవీంద్ర తదితరులు (ఫైల్)

## బెస్ట్ ఫిషర్‌గా అనంత విజయ

**● బెస్తపాలెం నుంచి ఎదిగిన పారిశ్రామికవేత్త**

బాపట్ల, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): దేశంలో 462 హేచరీలు ఉన్నాయి. అయితే ఓ మహిళ ఆధ్వర్యంలోనూ హేచరీలు ఉన్నాయంటే ఆశ్చర్య పోవాల్సింది. అయితే అందరినీ ఆశ్చర్య పరచడమే కాకుండా ఎందరో ప్రముఖుల నుంచి ప్రశంసలు అందుకుంటున్నారు.. బాపట్ల పట్టణంలోని బెస్తపాలేనికి చెందిన మత్స్యకార మహిళ అనంత విజయ. మత్స్యకార కుటుంబంలో పుట్టిన ఆమె ఆక్వా పరిశ్రమలో రాణిస్తున్న తీరు ఎందరికో ఆదర్శప్రాయంగా మారింది. బాపట్ల మండలం ధరివాదకొత్తపాలెంలో లక్షిత బయో రిసోర్సెస్, అన్నవరంలో లాలిత్య హెచరీస్ పరిశ్రమలను ఆమె నిర్వహిస్తున్నారు. హెచరీలో వనామి రొయ్యపిల్లలను ఉత్పత్తి చేస్తుండగా బయో రిసోర్సెస్ మందు ఫిష్ బ్రీడింగ్, అలంకరణ చేపల బ్రీడింగ్ తయారు చేస్తున్నారు. వీటి ద్వారా అనేకమందికి ఉపాధి కల్పిస్తున్నారు. ఏడాదికి రూ.1.8 కోట్ల టర్నవర్ చేస్తున్నారు. బాపట్లలో స్కిల్ కాలేజి నిర్వహిస్తూ యువతలో నైపుణ్యాలు పెంపొందించేందుకు కూడా ఆమె కృషి చేస్తున్నారు. రాబోయే రోజుల్లో అలంకరణ చేపల బ్రీడింగ్‌ను మలేషియా, సింగపూర్, అమెరికా వంటి దేశాలకు పంపించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఆమె ప్రతిభను గుర్తించి ఇటీవల ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా మంత్రులు కె.అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర బెస్ట్ ఫిషర్ ఎంటర్‌ప్రైజర్ అవార్డు ఇచ్చారు. న్యూఢిల్లీకి చెందిన ఆలిండియా ఫిషర్మెన్ మెగా కన్వెన్షన్ కానిస్టీషనల్ క్లబ్ బెస్ట్ ఫిసర్ ఉమెన్ ఎంటర్‌ప్రైజర్ అవార్డుతో సత్కరించింది.


రేషన్ బియ్యం వాహనాన్ని పట్టుకొన్న ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు

## రేషన్ బియ్యం పట్టివేత

బల్లికురవ. మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం వాహనాన్ని విజిలెన్స్ ఎన్‌ఫోర్సుమెంట్ అధికారుల బృందం శుక్రవారం తెల్లవారు జామున పట్టుకొని బల్లికురవ పోలీసు స్టేషన్‌కు అప్పగించింది. అందిన సమాచారం మేరకు మండలంలోని ఉప్పుమాగులూరు గ్రామం నుంచి అక్రమ మార్గంలో సుమారు 54 బస్తాల రేషన్ బియ్యాన్ని మినీ వ్యాన్‌లో తరలిస్తుండగా బల్లికురవ మండల కేంద్రానికి సమీపంలో కాపు వేసిన ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు తనిఖీలు చేసేందుకు నిలుపుదల చేయగా డ్రైవర్ వాహనాన్ని వదిలేసి పరారు అయ్యాడు. వెంటనే అధికారులు బియ్యం వాహనాన్ని పోలీసుస్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేశారు. బియ్యం తరలిస్తున్న వారి వివరాలను సేకరిస్తున్నారు. ఈ తనిఖీలలో అద్దంకి, మార్టూరు, రేపల్లె డీటీలు సుధీర్‌కుమార్, అబ్రహాం, ఓంకార్, డీఎస్‌వో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మహిళా దినోత్సవ సభలో మాట్లాడుతున్న ఎండీపీడీ

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

బల్లికురవ. మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎంపీడీవో కుసుమకుమారి అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అంతర్జాతీయ మహిళ దినోత్సవం జరిగింది. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి కుటుంబంలో ఆడపిల్లలను ఉన్నత విద్యా వంతులుగా చదివిస్తే వారి కుటుంబాలు కూడా ఉన్నత స్థాయికి ఎదుగుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శ్రీలక్ష్మి, పశువైద్యాధికారిణి పావనీకుమారి, కేజీబీవీ ప్రిన్సిపాల్ సరళకుమారి తదితరులు పాల్గొన్నారు.

## పులి మృతి ఘటనలో ఇద్దరు అధికారులపై వేటు

ఎర్రగొండపాలెం రూరల్ మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : విధులు నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉన్న ఇద్దరు ఫా రెస్టు అధికారులపై మార్కాపురం డీఎఫ్‌టీ గుండాల సందీప్‌కృపాకర్ సస్పెన్షన్ వేటు వేశారు. ఎర్ర గొండపాలెం మండలంలోని కొలుకుల బీట్ పరిధిలో ని అటవీ ప్రాంతంలో గత నెల 17న అటవీ జంతు వుల కోసం వేటగాళ్లు ఉచ్చులు వేశారు. ఆ ఉచ్చుల్లో చిరుత పులి చిక్కుకుని మృతి చెందిన సంగతి తెలి సిందే. ఈ కేసులో ఇప్పటికే ఐదుగురు నిందితులను అటవీశాఖ అధికారులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. ఘటనపై అధికారులు పూర్తిస్థాయిలో వి చారించారు. విధులలో నిర్లక్ష్యంగా ఉన్నారని విచా రణలో తెలడంతో కొలుకుల బీట్ సెక్షన్ ఆఫీసర్ బి. సక్యనాయక్, బీట్ ఆఫీసర్ టి.నాగేశ్వరరావులను స స్పెండ్ చేసినట్లు ఎర్రగొండపాలెం, గంజివారిపల్లి ఫా రెస్ట్ రెంజర్ సుబ్బారావు శుక్రవారం తెలిపారు.

## 'ఎత్తిపోతల' ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టిన దొంగలు

టంగుటూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పొందూరు ఎత్తిపోతల పథకంలో మ రోసారి చోరీ జరిగింది. దొంగలు గురువారం రాత్రి ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టి రాగి వైరు కోసం వె తికారు. అందులో అల్యూమినియం తీగ ఉండటం తో ట్రాన్స్‌ఫార్మర్‌ను అక్కడే వదిలేసి వెళ్లిపో యారు. ట్రాన్స్‌ఫార్మర్‌లోని ఆయిల్ అంతా బయ ట పారబోశారు. రెండు నెలల క్రితం ఇక్కడే దొం గతనం జరిగింది. ట్రాన్స్‌ఫార్మర్‌ను ఛిద్రంచేసి అం దులోని రాగితీగను దొంగలు అపహరించుకెళ్లారు. రైతులే చందాలు వేసుకొని రూ.5లక్షలు వెచ్చించి బాగుచేసుకొని వినియోగంలోకి తెచ్చారు. మళ్లీ దొంగలు ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టడంతో ఆయ కట్టుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చోరీపై టంగుటూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ సూచన మేరకు క్లూస్ టీం రంగంలోకి దిగి ఘటనా స్థలంలో వేలిముద్రలను సేకరించింది.

# గుంతల రోడ్లకు వీడిన గ్రహణం

**కూటమి ప్రభుత్వం రాకతో మోక్షం**

**వైసీపీ పాలనలో అస్తవ్యస్తంగా మారిన వైనం**

**నేడు శరవేగంగా అభివృద్ధిపనులు**

పర్చూరు, మార్చి 7(ఆంధ్రజ్యోతి) వైసీపీ పాలనలో అభివృద్ధికి నోచకోక ఆగిపోయిన పనులకు గ్రహణం వీడినట్లయ్యింది. కూటమి పాలనతో రోడ్ల రూపు రేఖరుల మారుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో రహదారుల అభివృద్ధికి చర్యలు చర్యలు చేపట్టక పోవటంతో ఎక్కడ చూసినా రోడ్లు గుంతలమయం కావటంతో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు, ప్రజలు తీవ్ర అవస్థలు పడాల్సిన పరిస్థితి ఉంది. రోడ్లు అధ్వానంగా మారటంతో ప్రమాదాలు జరిగి ప్రజలు ప్రాణాలు కోల్పోవాల్సిన దుస్థితి ఉంది. ప్రధాన రహదారులు సైతం గుంతల మయం అయినా గంపెడు మట్టి కూడా పోసిన దాఖలాలు లేవు. ఈ తరుణంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టడంతో రోడ్ల మరమ్మతులకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా తొలివిడత రోడ్లకు ఏర్పడిన గుంతలను పూడ్చే విధంగా చర్యలు చేపట్టింది. నిన్నా మొన్నటి వరకు గుంతలు మయం అయి అస్తవ్యస్తంగా మారిన రోడ్లు నేడు రూపురేఖలు మారిపోయాయి.


నాడు

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పర్చూరు - గుంటూరు రోడ్డు పరిస్థితి ఇలా


నేడు

ప్రజా కూటమి ప్రభుత్వం రాకతో అభివృద్ధి చేసిన పర్చూరు -గుంటూరు రోడు

**వినియోగంలోకి రానున్న ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రం**

పర్చూరులో రూ.2కోట్ల వ్యయంతో అప్పటి తెలుగుదేశం పార్టీ హయాంలో నిర్మాణం చేసుకున్న ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రం వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభోత్సవానికి నోచుకోలేదు. టీడీపీ ప్రభుత్వం మారటం వైసీపీ అధికారంలోకి రావటంతో కొద్దిపాటి నిధులు సమకూర్చి వినియోగంలోకి తీసుకువచ్చే క్రీడా వికాస కేంద్రాన్ని పక్కన పట్టింది. దీంతో క్రీడాకారులకు క్రీడా వికాస కేంద్రం అందని దాక్షలా మారింది. టీడీపీ ప్రజా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరుణంలో క్రీడాకారులకు ప్రోత్సాహం అందించాలన్న సంకల్పంతో యుద్ధప్రాతిపతికన స్థానిక ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రత్యేక కృషితో రూ.20 లక్షల నిధులు కేటాయించి వినియోగంలోకి వచ్చే విధంగా కార్యాచరణ రూపొందించారు. ప్రస్తుతం పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇలాంటి పనులు నియోజకవర్గంలో అనేకం జరుగుతున్నాయి.


క్రీడా ప్రాంగణాన్ని వినియోగంలోకి తీసుకు వచ్చే విధంగా చేపడుతున్న పనులు

# సబలల సమరం

**చారిత్రాత్మక విజయంగా అమరావతి పోరు**

**ఇంటి పని చేసుకుంటూనే**

**ఐదేళ్లు ధీరోదాత్త పోరాటం**

గుంటూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): అప్పటి వరకు ఆ మహిళలు ఇళ్లకే పరిమితం. ఇళ్లలో లేదంటే వ్యవసాయ పనుల్లోనే నిమగ్నం. అలాంటి వారు ఆంధ్రుల కలల రాజధాని కోసం ఐదేళ్లు ధీరోదాత్త పోరాటం చేశారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఆయువు కోల్పోయే దయనీయ స్థితి నుంచి అమరావతిని రక్షించుకున్నారు. పోలీసుల దౌర్జన్యాలు, లాఠీచార్జీలు.. కేసులు.. దాడులు.. అధికారం.. అవమానాలు.. కుట్రలెన్నింటినో ఎదుర్కొని ఐదేళ్ల పోరాటం చేసి అమరావతిని రాజధాని గ్రామాల మహిళలు అజరామరం చేశారు. సాధారణ గృహిణులుగా ఉండే మహిళలు ఉద్యమబాట పట్టి అసాధారణ వీర వనితలుగా ఎదిగారు. కుల, మతాలకు అతీతంగా సాగిన వారి పోరాటంతో నవ్యాంధ్ర కలల రాజధాని తిరిగి పునర్జీవం పోసుకుంది. ఎందరో వీర వనితలు బయటి ప్రపంచానికి తెలియకుండా ఉద్యమానికి ఊపిరులూదారు. వారికి ప్రతీకలుగా ఒకరిద్దరి గురించి..

### వెనకడుగు వేయలేదు


షేక్ వహీదా రెహమాన్

వెలగపూడి గ్రామానికి చెందిన షేక్ వహీదారెహమాన్. రాజధాని కోసం ఎకరంన్నర పొలం ఇచ్చారు. దంపతులిద్దరూ ఉద్యమంలో ముందుండేవారు. కరోనా సోకి భర్త హిమాంసాహెబ్ చనిపోయారు. అయినా రెహమాన్ వెనకడుగు వేయలేదు. బిడ్డలను చదివించుకుంటూనే రాజధానిపై జరుగుతున్న కుట్రలకు వ్యతిరేకంగా రోడ్డెక్కారు. క్షేత్రస్థాయిలో మహిళలను కదిలించి ఉద్యమాన్ని పదునెక్కించారు. ఐదేళ్లపాటూ ఉద్యమాన్ని అగ్రపథాన నిలిపి కొనసాగించారు.

### దళిత జేఏసీ నేతగా


అంకం సువర్ణ కమల

తుళ్లూరు గ్రామానికి చెందిన దళిత మహిళ. సాధారణ కుటుంబ నేపథ్యం నుంచి వచ్చి ఉద్యమ నేతగా ఎదిగారు. అమరావతి దళిత జేఏసీ నేతగా ఎదిగారు. దళితవాడల్లో చైతన్యాన్ని రగుల్కొల్పి అమరావతి ఉద్యమ అగ్రభాగాన వారిని నిలపడంలో ఆమె కీలకంగా నిలిచారు. పాదయాత్రలో నడిచి తమ త్యాగాలను ప్రపంచానికి చాటారు.

### ఎంతోమందికి స్ఫూర్తి


రావి గంగా పార్వతి

వెలగపూడికి చెందిన రైతు కూలీ రావి గంగా పార్వతి. రాజధాని కోసం ఇవ్వడానికి సెంటు భూమి కూడా లేని నిరుపేదరాలు. వయసులో పెద్దవారు కూడా. అయినా రాజధానిపై జరుగుతున్న కుట్రలతో చలించిపోయారు. భూములిచ్చిన రైతులు.. తనకు పని ఇచ్చిన అన్నదాతలకు జరుగుతున్న అన్యాయాన్ని తనకు జరుగుతున్న అన్యాయంగా భావించి ఆమె ఉద్యమంలోకి వచ్చారు. ఇలా వచ్చి అలా వెళ్లడం కాదు.. ఐదేళ్లపాటు ఉద్యమంలోనే కొనసాగారు. ఎంతోమందికి స్ఫూర్తిగా నిలిచారు.

### మహిళలను చైతన్య వంతం


అరుణ

తుళ్లూరు గ్రామానికి చెందిన అరుణ. ఆమె కటుంబం రాజధాని కోసం రెండెకరాలు పొలం ఇచ్చారు. రాజధానిపై జరిగిన కుట్రల నేపథ్యంలో ఆమె ఉద్యమంలోకి వచ్చారు. సాధారణ గృహిణిగా ఉన్న ఆమె ఉద్యమ ప్రభావంతో చైతన్యం పొందారు. ఎందరో మహిళలను చైతన్యవంతం చేసి ఉద్యమంలోకి తీసుకువచ్చారు.

## 24,25 తేదీల్లో దేశవ్యాప్తంగా బ్యాంకుల సమ్మె

**● ఉద్యోగ సంఘాల వెల్లడి**

ఒంగోలు కలెక్టరేట్, మార్చి 7(ఆంధ్రజ్యోతి) : బ్యాంకు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 24,25వ తేదీల్లో దేశవ్యాప్తంగా జరిగే బ్యాంకుల సమ్మెను విజయవంతం చేయాలని పలువురు ఉద్యోగ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. బ్యాంకు ఉద్యోగ సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం సాయంత్రం ఒంగోలు నగరం నెల్లూరు బస్టాండులోని యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ బ్యాంకు ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో యజమాన్యాలు అనుసరిస్తున్న విధానాలు దారుణంగా ఉన్నాయన్నారు. బ్యాంకుల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడంతో పాటు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బ్యాంకులు ఐదు రోజులు పనిదినాలు కల్పించాలని కోరారు. బ్యాంకు యూనియన్లు ఇచ్చిన పిలుపు మేరకు జిల్లావ్యాప్తంగా ఈనెల 24,25తేదీల్లో సమ్మెను చేపడుతున్నట్లు తెలిపారు. గత కొంతకాలంగా వివిధ రూపాల్లో ఆందోళనలు నిర్వహిస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. డిమాండ్లు సాధించుకునేంత వరకు ఉద్యమం జరుగుతుందని చెప్పారు. అందులో భాగంగానే దశల వారీగా జరిగే ఆందోళన కార్యక్రమాల్లో బ్యాంకు ఉద్యోగులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కన్వీనర్ రాజీవ్ రత్నదేవ్, శ్రీనివాసరావు, సుబ్బారావు, యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.

## టీడీపీ సభ్యత్వ కార్డుల పంపిణీ

పొన్నలూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : మం డలంలోని తిమ్మపాలెం గ్రామంలో టీడీపీ మం డల ప్రధాన కార్యదర్శి మోరబోయిన మాల్యాద్రి ఆధ్వర్యంలో పార్టీ సభ్యత్వ కార్డులను శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు తిరుపాలు, ముచ్చు మాల్యాద్రి, ముచ్చు ఆదెయ్య, బి.మాలకొండారెడ్డి, ఎం.మల్లికార్జున, దాసరి కొం డలరావు పాల్గొన్నారు.

## ఎంపీ మాగుంటకు బీఎన్ పరామర్శ

సంతనూతలపాడు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఇటీవల బైపాస్ సర్జరీ చేయించుకున్న ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డిని శుక్రవారం చెన్నైలోని ఆయన స్వగృహంలో సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు బొకే అందజేసి కాసేపు మాట్లా డారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


మాగుంటను కలిసిన ఎమ్మెల్యే విజయ్‌కుమార్, నాయకులు

## చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి

నాగులుప్పలపాడు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ప్రమాద వశాత్తు క్యాండిల్ మంటలు దుప్పటికి అంటుకొని మం చంపై నిద్రిస్తున్న వృద్ధుడు గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన కనపర్తిలో చోటు చేసుకొంది. మండలంలోని కనపర్తి గ్రామం దళితకాలనీకి చెందిన మంచు శేషయ్య (76) మూడు రోజుల క్రితం తన ఇం ట్లో క్యాండిల్ వెలిగించి మంచం పక్కన ఉంచి నిద్రించారు. ఈక్రమంలో ప్రమాదవశాత్తు క్యాండిల్ మంచంపై పడి మంటలు చెలరేగి శేషయ్య గాయపడంతో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు.

## ప్రియురాలిని మోసగించిన ప్రియుడు

**చీరాల బస్టాండ్‌లో అర్ధరాత్రి వివాదం**

**పోలీసుల రంగ ప్రవేశం**

**తీసుకున్న డబ్బులు చెల్లించేందుకు అంగీకారం**

చీరాల, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : ప్రేమించానని నమ్మించి హైదరాబాదు అమీర్‌పేటకు చెందిన యువతిని చీరాల ప్రాంతంలోని పందిళ్లపల్లికి చెందిన యువకుడు మోసగించాడు. బాధితురాలు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పందిళ్లపల్లికి చెందిన వ్యక్తి కొంతకాలం హైదరాబాదులో జాబ్ కన్సల్టెన్సీ నిర్వహించాడు. ఈక్రమంలో అమీర్‌పేటకు చెందిన యువతితో పరిచయం ఏర్పడి అది ప్రేమగా మారింది. ఈనేపథ్యంలో ఏడాదిపాటు చీరాల్లో సహజీవనం కూడా చేశారు. అయితే ఆమెను మోసగించి చీరాల నుంచి పంపించి వేశాడు. ఈక్రమంలో ఆమె వద్ద నుంచి జాబ్ ఇప్పిస్తానంటూ రూ. 15 లక్షలు వరకు వసూలు చేశాడు. అవి తిరిగి చెల్లించకపోవడంతో శుక్రవారం హైదరాబాదు నుంచి చీరాల బస్టాండ్‌కు చేరుకున్న ప్రియురాలికి, ప్రియుడికి వివాదం జరిగింది. దీంతో పెద్ద ఎత్తున జనం గుమికూడారు. అయితే పోలీసులు రంగ ప్రవేశం చేయడంతో ప్రియుడు మెత్తబడి డబ్బులు చెల్లించేందుకు ఒప్పుకున్నాడు. ఈక్రమంలో పోలీసులు వివరాలు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నారు.

## 10న పొగాకు కొనుగోళ్లు ప్రారంభం

సంతనూతలపాడు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పేర్నమిట్టలోని ఒంగోలు-1వ వేలంకేంద్రంలో ఈనెల 10న ఉదయం 8-30 గంటకు పొగాకు కొనుగోళ్లు ప్రారంభమవుతాయని వేలంకేంద్ర నిర్వహణాధికారి రవికాంత్ శుక్రవారం తెలిపారు. వేలంకేంద్రం పరిధిలో 2,811 బ్యార న్‌లకు 11.8 మిలియన్ కేజీల పొగాకు సాగుకు అనుమతించినట్ల పేర్కొన్నారు.


చినగంజాం ఎత్తిపోతల పథకాన్ని పరిశీలిస్తున్న సత్యనారాయణ

## ఎత్తిపోతల పథకాల పరిశీలన

చినగంజాం, మార్చి 7(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కడవకుదురు, చినగంజాం ప్రాంతాల్లోని ఎత్తిపోతల పథకాలను రాష్ట్ర నీటి పారుదల అభివృద్ధి సంస్థ రిటైర్డ్ డీఈ ఎం.వై. సత్యనారాయణ శుక్రవారం పరిశీలించారు. పర్చూరు శాసనసభ్యుడు ఏలూరి సాంబశివరావు ఆదేశాల మేరకు కడవకుదురు ప్రాంతంలోని ఐదు ఎత్తిపోతల పథకాలను, సోపిరాల ప్రాంతంలోని చినగంజాం ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించినట్లు సత్యనారాయణ తెలిపారు. ఎత్తిపోతల పథకాల నిర్వహణ ఎలా ఉంది, విద్యుత్ మోటర్ల పరిస్థితి, ఆయకట్టు ఎంత, మరమ్మతులు, కాలువల పరిస్థితి తదితర విషయాలను ఆయన రైతులు, నిర్వహణ కమిటీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. కడవకుదురు గ్రామంలో నూతన ఎత్తిపోతల పథకానికి సంబంధించి పరిశీలన చేసినట్లు తెలిపారు. ఎత్తిపోతల పథకాలకు సంబంధించిన మోటార్ల మరమ్మతులు, నూతన మోటర్లు, కాలువలకు కావలసిన పైపులు తదితర వాటికి అంచనాలు తయారు చేసి ఎమ్మెల్యే ఏలూరికి అందజేయనున్నట్లు తెలిపారు. ఎత్తిపోతల పథకాలను పునరుద్ధరించి ప్రభుత్వ నిధులతో చివరి ఆయకట్టు భూములకు సాగునీరు అందించాలనే ధ్యేయంతోనే ఎత్తిపోతల పథకాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. మహారాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందజేస్తున్న విధానాలలో భాగంగా బ్యాంకుల ద్వారా రైతులకు వడ్డీలేని రుణాలను అంద జేసి ఎత్తిపోతల పథకాల నిర్వహణను అప్పగించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పోద వీరయ్య, సంతరావూరు డీసీ ఉపాధ్యక్షుడు డి.రామకృష్ణ, ఎత్తిపోతల పథకాల అధ్యక్షులు, సభ్యులు, రైతులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


విద్యార్థులకు పంపిణీ చేసిన పరీక్షా సామగ్రితో పూర్వవిద్యార్థులు

## విద్యార్థుకు పరీక్షా సామగ్రి పంపిణీ

మార్టూరు,మార్చి7(ఆంధ్రజ్యోతి):మండలంలోని కోలలపూడి జడ్పీ హైస్కూల్లో శుక్రవారం 10 వతరగతి విద్యార్థులకు రూ. 12 వేల రూపాయలు విలువచేసే పరీక్షా సామాగ్రిని 1995-96 సంవత్సరం పూర్వ విద్యార్థులు పంపిణీ చేశారు. పరీక్ష రాసే ప్యాడ్, పెన్నులు, కొన్ని గైడ్ పుస్తకాలు తదితర సామగ్రిని పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గోగినేని బాలకృష్ణ, పూర్వవిద్యార్థులు సర్దార్ పాపారాయుడు, డి. వెంకటరావు, ఎన్ మార్క్, కె. నాగేశ్వరరావు, పి. వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

## మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

అద్దంకి, మార్చి7(ఆంధ్రజ్యోతి): ఇంటి కోసం తీసుకున్న రుణం తీర్చలేక పోవడం, అదే మయంలో కుమార్తె ప్రేమ వివాహం చేసుకుందన్న మనో వ్యథకు గురైన ధనరాజుపల్లి కోటేశ్వరరావు(37) అనే వ్యక్తి ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు అద్దంకి మండలంలోని తిమ్మాయపాలెంకు చెందిన కోటేశ్వరరావుకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఏడాది క్రితం బ్యాంక్‌లో రుణం తీసుకొని ఇంటి నిర్మాణం చేశాడు. ఐదు నెలల క్రితం కుమార్తె ప్రేమ వివాహం చేసుకుంది. అప్పు తీర్చే దారి లేక, కూతురు ప్రేమ వివాహం జీర్ణించుకోలేక పోయిన కోటేశ్వరరావు మద్యానికి బానిసయ్యాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం భార్య మరియమ్మ బయట దుకాణం వద్దకు వెళ్లి వచ్చే లోపు ఇంట్లో లోపల గడియ పెట్టుకొని ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకున్నాడు. మరియమ్మ వచ్చి చూడగా తలుపు వేసి ఉంది. బలవంతంగా తలుపు తీసి చూడగా ఉరివేసుకొని ఉన్నాడు. వెంటనే అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకుపోగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. భార్య మరియమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఖాదర్‌బాషా తెలిపారు.


కోటేశ్వరరావు మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై ఖాదర్‌బాషా

## కారు ఢీకొని వ్యక్తి మృతి


పున్నబాబు (50)

బల్లికురవ. మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని గొర్రెపాడు జంక్షన్ సమీపంలో ఉన్న వైన్ షాపు వద్ద రోడ్డు దాటుతున్న జంద్రాజుపల్లి పున్నబాబు (50) ను కారు ఢీకొనటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అందిన సమాచారం మేరకు గొర్రెపాడు గ్రామానికి చెందిన జంద్రాజుపల్లి పున్నబాబు గ్రామానికి సమీపంలో ఉన్న వైన్ షాపునుంచి రోడ్డు పైకి రాగా గొర్రెపాడులోని వెలమవారిపాలెం రోడ్డులో శౌరి అను శివ భక్తుడు కారుతో ఢీకొట్టాడు. తీవ్ర గాయాలైన పున్నబాబు అక్కడిక్కడే మృతి చెందాడు. ప్రమాద స్థలాన్ని బల్లికురవ పోలీసులు పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేశారు.

## ఆటో ఢీ కొని సైకిలిస్టుకు గాయాలు

అద్దంకి : సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తిని ఆటో ఢీ కొనటంతో గాయాలు అయ్యాయి. స్థానికుల కథనం మేరకు అద్దంకి మండలం వెంపరాలకు చెందిన మందా కోటేశ్వరరావు శుక్రవారం సాయంత్రం సైకిల్‌పై కలవకూరు రోడ్డులోకి వస్తుండగా అద్దంకి నుంచి కలవకూరు వైపు వెళ్తున్న ఆటో ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ కోటేశ్వరరావును 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం ఒంగోలు వైద్యశాలకు తరలించారు.


తీవ్రం గాయ పడిన మందా కోటేశ్వరరావు

## అవీ..ఇవీ

## త్వరలో ఓఎన్‌జీసీ సర్వే


తహసీల్దార్‌తో మాట్లాడుతున్న ఓఎన్‌జీసీ అధికారులు

ఇంకొల్లు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఇంకొల్లు మండల పరిధిలోని పలు గ్రామాలలో భూమిలోపల నిక్షిప్తమైన గనులు, ఆయిల్ వంటి వాటిపై సర్వేలు నిర్వహించేందుకు తహసీల్దార్ వెంకటరత్నంను శుక్రవారం ఓఎన్‌జీసీ అధికారులు కలిశారు. ఆరు నెలల పాటు మంగళగిరి నుంచి నాయుడుపేట వరకు ఈ సర్వే కొనసాగుతుందని, మండలంలో నాగండ్ల, పావులూరు, గంగవరం, ఇడుపులపాడు, భీమవరం, కొణికి గ్రామాల పరిధిలో ఈ సర్వేలు నిర్వహించనున్నట్లు ఆయన దృష్టి తీసుకెళ్లారు. తహసీల్దార్‌ను కలిసిన వారిలో ఓఎన్‌జీసీ సూపర్‌వైజర్లు దాసరి భరత్‌కుమార్, డీకే దీపక్, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.


మృతుని భార్యకు నాలుగు లక్షల రూపాయల చెక్కును అందజేస్తున్న ఏపీజీబీ మేనేజర్ సీనానాయక్

## ప్రమాద బీమా చెక్కుల అందజేత

బల్లికురవ. మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుంటుపల్లి గ్రామానికి చెందిన పూసుకూరి హరిబాబు అను రైతు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ రైతు బల్లికురవ ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో ప్రధాన మంత్రి జీవన జ్యోతి, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజనలో చేరి ఉన్నాడు. రెండు పథకాల్లో సభ్యుడు అయిన హరిబాబుకు రూ. నాలుగు లక్షల బీమా నగదు మంజూరు కావటంతో శుక్రవారం ఏపీజీబీ బ్యాంకు చీప్ మేనేజర్ సీనానాయక్ మృతుడు భార్య సునీతకు చెక్కులను అందజేశారు. ఈసందర్భంగా బ్యాంకు మేనేజర్ మాట్లాడుతూ బ్యాంకులో రుణాలు తీసుకొన్న రైతులు తప్పనిసరిగా బీమా పథకంలో నమోదు కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ రవీంద్రబాబు, అసిస్టెంట్ మేనేజర్ సునీత గ్రేస్ తదితరులు పాల్గొన్నారు.


బాలికలకు సైకిళ్ల పంపిణీలో ఎంఈవో వస్రాంనాయక్,ఎఫర్ట్ సంస్థ డైరెక్టర్ జాప్తి వెంకటమోహనరావు తదితరులు

## బాలికలకు సైకిళ్ల పంపిణీ

మార్టూరు, మార్చి7 (ఆంధ్రజ్యోతి):పేద మధ్యతరగతి కుటుంబాలకు చెందిన బాలికలు రోజూ బడికి రావడానికి సైకిళ్లను పంపిణీ చేసిన ఎఫర్ట్ సంస్థ పలువురికి ఆదర్శంగా నిలిచిందని ఎంఈవో వస్రాం నాయక్ అన్నారు. శుక్రవారం మార్టూరు జడ్పీ హైస్కూల్లో ఎఫర్ట్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏకం అమెరికా సంస్థ ఆర్థిక సహకారంలో చేయూత ప్రాజెక్ట్‌ద్వారా 50 మంది బాలికలకు సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎఫర్ట్ సంస్థ డైరెక్టర్ జాష్టి వెంకట మోహన రావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో దూరప్రాంతాల నుంచి బడికి వచ్చే బాలికల కోసం ఏకం సంస్థ సైకిళ్ల పంపిణీకి రూప కల్పన చేసిందన్నారు. గతంలోనే 50 సైకిళ్లను పంపిణీ చేయగా ప్రస్తుతం మరో 50 సైకిళ్లను పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు మద్దుమాల కోటేశ్వరరావు, రోటరీ సభ్యులు గుండవరపు వెంకట ప్రసాద్, ఉపాధ్యాయులు యం. ఈశ్వరప్రసాద్, పార్వతి, ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


కాలిపోయిన సుబాబుల్ తోట

## నాలుగు ఎకరాల్లో సుబాబుల్ తోట దగ్ధం

బల్లికురవ. మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పుమాగులూరు గ్రామంలో ప్రమాదవశాత్తు నాలుగు ఎకరాల్లోని సుబాబుల్ తోటలు శుక్రవారం అగ్నికి ఆహుతి అయ్యాయి. ఉప్పుమాగులూరు నుంచి కొణిదెన వైపు వచ్చే రోడ్డు పక్కన ఉన్న అమరనేని భార్గవ్, అయినాల యేగేశ్వరరావు, దేవినేని చౌదరయ్య అను రైతులకు చెందిన నాలుగు ఎకరాల సుబాబుల్ తోటలలో మంటలు చెలరేగి పంట మెత్తం పూర్తిగా కాలిపోయింది. ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు సిగరెట్ కాల్చి రోడ్డు పక్కన పడవేయటం వలనే ప్రమాదం జరిగి ఉంటుందని రైతులు అంటున్నారు. సుమారు నాలుగు లక్షల మేర నష్టం జరిగిందని బాధిత రైతులు తెలిపారు.



# భౌభౌలతో బేంబేలు

**మూకుమ్మడి దాడులతో ప్రజల భయభ్రాంతులు**
**గ్రామాల్లో పెరిగిపోయిన వీధి కుక్కలు**
**ఎక్కడ చూసినా గుంపులు గుంపులుగా దర్శనం**
**పట్టించుకోని పంచాయతీ అధికారులు**

పర్చూరు, కారంచేడు, మార్చి7(ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో వీధి సింహాలతో(కుక్కలు)తో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. మూకుమ్మడిగా దాడులకు పాల్పడటంతో ఉరుకులు పరుగులు పెడుతున్నారు. వీధుల్లో గుంపులు గుంపులుగా సంచరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. రాత్రి సమయాల్లో పరిస్థితి మరింత దయనీయంగా మారింది. వీదుల్లో ఒంటరిగా రాపోకలు సాగించాలంటే కుక్కల దాడికి గురికావాల్సి వస్తుందన్న చందాన పరిస్థితి నెలకొంది. ఎక్కడ చూచినా వీధి సింహాలు గుంపులు గుంపులుగా దర్శనమివ్వటం ఇందుకు నిదర్శనం. గడిచిన పక్షం రోజుల్లో అనేక మంది వీధి సింహాల బారిన పడి ఆసుపత్రి పాలయ్యారు. పర్చూరు, కారంచేడు, ఇంకొల్లు మండలాల పరిధిలో సమస్య మరింత జటిలంగా మారింది..

**వాహనదారులు ఉరుకుల పరుగులు**


పర్చూరు - ఇంకొల్లు రోడ్డులో విచ్చలవిడిగా తిరుగుతున్న శునకాల గుంపు

వీధుల్లో ద్విచక్రవాహనాలు ప్రయాణించాలంటే హడలే అన్న చందాన పరిస్థితి ఉంది. ద్విచక్రవాహన దారులను వెంబడించి కరుస్తుండటంతో వాహనం అదుపు తప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇలాంటి సంఘటనలు పర్చూరు - ఉప్పుటూరు, చెరుకూరు గ్రామ రహదారుల్లో అనేకం చోటుచేసుకున్నాయి. స్థానిక వైఆర్ హైస్కూల్ సమీపంలో ఇటీవల వీధి సింహాలు ద్విచక్రవాహన దారుని వెంట పడటంతో తప్పించుకునే క్రమంలో వాహనం అదుపుతప్పి రోడ్డుపై పడిపోయాడు. దీంతో తలకు బలమైన గాయం అయి ప్రాణాలు కోల్పోయాడు. పర్చూరు పరిధిలోని ఓ రెవెన్యూ అధికారి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా వెంటబడటంతో తప్పించుకోబోయి వాహనం అదుపుతప్పి అసుపత్రిపాలయ్యారు. పర్చూరు మండలం దేవరపల్లి గ్రామానికి చెందిన ఓవృద్ధురాలు రోడ్డుపై వస్తున్న తరుణంలో వీధి సింహాలు దాడిచేసి తీవ్రంగా గాయపరచటంతో అసుపత్రిపాలైంది. ఇలాంటి సంఘటలు మండలంలో అనేకం ఉన్నాయి. వీధి శునకాల దాడులతో చిన్నారులు ఇంటి నుంచి బయటకు రావాలంటే భయపడుతున్నారు. పర్చూరులోని ఇందిరా కాలనీ, అంబేడ్కర్ నగర్, జయంతీ కాలనీలలతోపాటు, కారంచేడు మండలంలోని జరుబులవారిపాలెం, తిమిడితపాడు, దగ్గుబాడు, స్వర్ణ గ్రామాల్లో గేదెదూడలు వీధి శునకాల బారినపడి ప్రాణాలను కోల్పోయిన సంఘటనలు అనేకం ఇటీవల ఉన్నాయి.

**ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు**

వీధి సింహాలు బారిన పడి ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే అధికారులే కరువయ్యారని ప్రజలు వాపోతున్నారు. కుక్కల బెడదపై చర్యలు తీసుకోవాలని పంచాయతీ అధికారులకు విన్నవించుకున్నా ఇది తమ పనికాదన్నట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆవేదన చెందుతున్నారు.


పర్చూరులోని బొమ్మల సెంటర్‌లో రాత్రి సమయాల్లో రోడ్డుపై గుంపులుగా తిరుగుతున్న వీధికుక్కలు

**రేబిస్ ఇంజెక్షన్‌కూడా అంతంత మాత్రమే**

వీధి సింహాల బారిన పడి గాయాలతో ప్రభుత్వ వైద్యశాలలకు వెళ్లినా రేబిస్ వ్యాక్సిన్ అంతంతమాత్రంగానే ఉందని ప్రజలు అంటున్నారు. దీంతో గత్యంతరం లేక ప్రయివేట్ వైద్యశాలకు వెళ్లాల్సి వస్తుంది. మరో పక్క ఏది మంచికుక్కో పిచ్చికుక్కో అర్థం కాక కుక్కల దాడిలో గాయపడిన వారు ఆందోళనకు గురవుతున్నారు. దీనికి తోడు ఇటీవల చీరాలలో ర్యాబీస్ వ్యాధి కలకలం రేపిన తరుణంలో ప్రజల్లో మరింత ఆందోళన నెలకొంది. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు వీధి సింహాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## కుక్కల దాడిలో 12 గొర్రెపిల్లల మృతి

మార్టూరు,మార్చి7(ఆంధ్రజ్యోతి):మండలంలోని ద్రోణాదుల గ్రామంలో రాగినీడి గంగయ్యకు చెందిన కొష్టంలో ఉన్న గొర్రెపిల్లలపై గురువారం అర్ధరాత్రి వీధికుక్కల మంద దాడి చేసింది.ఈ దాడిలో 12 గొర్రెపిల్లలు మృతి చెందాయి. దాదాపుగా లక్ష రూపాయలు నష్టం జరిగిందని గంగయ్య ఆవేదన వ్యక్తం చేశారు.గ్రామంలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని, రోజూ కొష్టంలో రాత్రి సమయంలో గొర్రెలు నిద్రిస్తూ ఉంటాయని,అడపా దడపా కుక్కలు వస్తుంటాయని కానీ, ఈ విధంగా గొర్రెపిల్లలను చంపుతాయని అనుకోలేదని, వాపోయారు. ఇకనైనా గ్రామంలో కు క్కల బెడదను తొలగించాలని పంచాయతీ అధికారులను కోరారు.

# అవమానాల నుంచి ఆత్మస్థైర్యంతో ముందుకు..

**మహిళా దినోత్సవంలో వక్తలు**

చీరాల, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం సమాజంలో ఎంతో మంది మహిళలు అవమానాలు ఎదుర్కొని ఆత్మస్థైర్యంతో విజయాలు సాధిస్తున్నారని పలువురు వక్తలు అన్నారు. చీరాల నియోజకవర్గం పరిధిలో శుక్రవారం ముందస్తు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈక్రమంలో సమాజంలో అబల విలువలు తెలియజేశారు. చీరాల సీఈసీ కళాశాలలో డీఎస్పీ ఎండీ మొయిన్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో సీఐ శేషగిరిరావు, ఈపూరుపాలెం ఎస్సై చంద్రశేఖర్ పాల్గొన్నారు. అలాగే సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమం సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన వేటపాలెం ఎస్సై వెంకటేశ్వర్లు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీష్, తదితరులు పాల్గొన్నారు. పందిళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో మహిళా దినోత్సవ వేడుకలు జరిగాయి, ఈసందర్భంగా ప్రతినిధులు ఉపాధ్యాయినులకు ఆట, పాటల పోటీలు నిర్వహించారు. స్థానిక వైఎ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వేడుకలు జరిగాయి. అలాగే బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో పేరాల ఆర్యవైశ్య కల్యాణ మండపంలోనూ జరిగాయి.


మహిళా దినోత్సవ సభలో మాట్లాడుతున్న తహసీల్దార్ సింగారావు

**మహిళలు అన్ని రంగాలలో ఉన్నతంగా ఎదగాలి**

పంగులూరు, మార్చి 7(ఆంధ్రజ్యోతి):సమాజంలో సగ భాగంగా ఉన్న మహిళలు అన్ని రంగాలలో ఉన్నతంగా ఎదగాలని మండల తహసీల్దార్ పి.సింగారావు అన్నారు. పంగులూరు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళాదినోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ సింగారావు మట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలలో పౌష్టికాహారం అందించడంతో పాటు బాలికలను బాల్యం నుంచే చదువు, క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించాలన్నారు. బాల్య వివాహాలను అరికట్టడంతో పాటు బాలికలను ఉన్నతంగా చదివించి వారి ఎదుగుదలకు తల్లిదండ్రులు తగిన అవకాశాలు కల్పించి ప్రోత్సహించాలని ఎంపీడీవో స్వరూపారాణి కోరారు. సాంకేతికతను అందిపుచ్చుకుని వివిధ రంగాలలో ఎదుగుతున్న మహిళలను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మజ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీడీవో స్వరూపరాణి, గ్రామ సర్పంచ్ గుడిపూడి నాగేంద్రంను అంగన్‌వాడీ కార్యకర్తలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.


పందిళ్లపల్లి హైస్కూల్లో టీచర్లకు నిర్వహిస్తున్న మెమరీ గేమ్

**అధికారులు, ఉపాధ్యాయినులకు సన్మానం**

అద్దంకిటౌన్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని శుక్రవారం పలు శాఖలు, కళాశాలలు, పాఠశాలలలో ఘనంగా నిర్వహించారు. మహిళ దినోత్సవం శనివారం రావడంతో పాటు ఆరోజు సెలవు అయినందున ముందస్తుగా ఆయా ప్రభుత్వ శాఖలు, విద్యా సంస్థలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద ఐసీడీఎస్ అద్దంకి రూరల్ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో ఏ. కృష్ణకుమారి,ఉత్తమ ఉపాధ్యాయులు కె. రామలక్ష్మి, ఎస్. నాగమల్లిక, ఏపీవో గాయత్రిదేవిలను ఘనంగా సన్మానించారు. అలాగే మండలంలోని మైలవరం జడ్పీహెచ్‌ఎస్‌లో ఇన్‌చార్జి హెచ్ఎం శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మహిళ ఉపాధ్యాయినులు వి. వెంకటలక్ష్మి, పద్మావతి, పీడీ లావణ్యలను ఘనంగా సత్కరించారు. జడ్పీహెచ్ఎస్ చక్రాయపాలెంలో హెచ్ఎం కేవీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయినులు పూనూరి జ్యోతి నిర్మల, కుంచాల విజయలక్ష్మిలను ఘనంగా సత్కరించారు.


అద్దంకి ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మహిళా అధికారులను సన్మానిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు


అడుసుమల్లి పంచాయతీలో పట్టపగలు వెలుగుతున్న వీధిలైట్లు

## పగలే వెన్నెల

- రాత్రింబవళ్లు విద్యుత్ వెలుగులు
- అడుసుమల్లి పంచాయతీ అధికారుల తీరే వేరు

అడుసుమల్లి( పర్చూరు),మార్చి7(ఆంధ్రజ్యోతి) పర్చూరు మండలం అడుసుమల్లి పంచాయతీ అధికారుల తీరే వేరు అన్న విధంగా పరిస్థితి. పట్టపగలే వీధిలైట్లు వెలుగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఓ పక్క పంచాయతీ ఆదాయాన్ని పెంచి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ప్రభుత్వం చెబుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవలేదు. పొదుపుగా వాడుకోవాల్సిన విద్యుత్‌ను ఇలా దుబారా చేస్తూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీనిపై వివరణ అడిగా ఇది కేవలం టెస్టింగ్ అంటూ మాటదాటేస్తున్నారు. పట్టపగలు విద్యుత్ ఇలా వృథా అవుతుంటే దాన్ని చూసిన ప్రజలు ఇదేమి విడ్డూరం అంటూ ముక్కున వేలేసుకుంటున్నారు.

# జగన్ దిష్టిబొమ్మ దహనం

- సైకో చేష్టలు మానాలంటూ జనసైనికుల నినాదాలు

పర్చూరు, మార్చి 7(ఆంధ్రజ్యోతి) జనసేన అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌పై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా శుక్రవారం స్థానిక బొమ్మల సెంటర్‌లో జనసేన ఆధ్వర్యంలో దిష్టిబొమ్మను తగులబెట్టి నిరసన తెలిపారు. సైకో జగన్ పద్ధతి మార్చుకో అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. తొలుత పర్చూరులోని అద్దంకి నాంచారమ్మ అమ్మ వారి కళ్యాణ మండపంలో జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం విజయవంతంపై పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బాపట్ల జిల్లా పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త వడ్రాణం మార్కండేయ బాబు, రాష్ట్ర మాల వేల్ఫేర్ కోఆపరేటీవ్ చైర్మన్, పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జి పెద్దపూడి విజయ్ కుమార్‌లు పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి జనసేనులు కృషి చేసి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వంతో కలిసి విజయం సాధించే విధంగా కృషి చేయాలన్నారు. అనంతరం జగన్ దిష్టిబొమ్మతో ర్యాలీగా బయలు దేరి పర్చూరు బొమ్మల సెంటర్‌లో దహనం చేసి నిరసన తెలిపారు.


పర్చూరు బొమ్మల సెంటర్‌లో జగన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న జనసేన పార్టీ నేతలు పెద్దపూడి విజయ్ కుమార్, మార్కండేయ బాబు, శంకరశెట్టి చిరంజీవి , శ్రేణులు

ఈకార్యక్రమంలో జిల్లా కార్యదర్శి శంకరశెట్టి చిరంజీవి, కఠారి సురేంద్రబాబు, కారంపూడి సందీప్‌తేజ, ఆయా మండలపార్టీ అధ్యక్షులు సాకిరి శ్రీనివాసరావు, మందపాటి కిషోర్, నారిశెట్టి ప్రవీణ్, సందు శ్రీను, రంగిశెట్టి ఆంజనేయులు, దీర్ఘాల రమేష్, కంఢా సురేంద్ర బాబు, తోట మణి, అచ్చుకోలు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## ముఖాముఖి

**ఆధునిక టెక్నాలజీతో నేర నియంత్రణకు కృషి**
**- చీరాల డీఎస్పీ ఎండీ మొయిన్**



చీరాల, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కాలంలో సైబర్, ఇతర నేరాలు పెరిగిపోయాయి. దీంతో నియంత్రణకు పోలీసు వ్యవస్థ ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఈక్రమంలోనే పల్లె నిద్రలో భాగంగా చీరాల సబ్ డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

**ప్రశ్న:** చీరాల సబ్ డివిజన్ పరిధిలో ఎంత మంది పోలీసులు ఉన్నారు ?

**జవాబు :** సబ్ డివిజన్ పరిధిలో ఆరుగురు సీఐలు, 15 మంది ఎస్సైలు, 380 మంది పోలీసు సిబ్బంది ఉన్నారు. వీరితో శాంతా భద్రతలు, ట్రాఫిక్ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాము.

**ప్రశ్న :** నేర నియంత్రణకు తీసుకున్న చర్యలు ఏమిటి ?

**జవాబు:** ఇటీవల కాలంలో సైబర్ నేరాలు పేట్రేగుతున్నాయి. ఈక్రమంలో వీటిపై ప్రతిరోజు 5-7 గంటల మధ్య విజిబులింగ్ పోలీస్ కార్యక్రమం నిర్వహిస్తున్నాము. ఇప్పటికే సబ్ డివిజన్ పరిధిలో 1,029 సీసీకెమెరాలు అమర్చాం. నిరంతరం నిఘా ఉంచాం. త్వరలో డ్రోన్స్ కెమెరాలు అమర్చనున్నాం.

**ప్రశ్న:** ఇటీవల చేదించిన కేసుల్లో క్లిష్టమైనది ఏది ?

**జవాబు:** కడప జైలు నుంచి విడుదలయిన నిందితుడు 13 రోజుల్లోనే 8 చోరీలకు పాల్పడ్డాడు. వాటిల్లో రెండు కార్లు, 6 ఇళ్లల్లో నగదు, వస్తువులు అపహరించాడు. ఈక్రమంలో అద్దంకిలో నమోదయిన కేసు క్లిష్టంగా ఉంది. అయితే జిల్లా ఎస్పీ తుషార్‌డూడీ సూచనలతో ఆధునిక టెక్నాలజీ వినియోగించి పట్టుకున్నాం.

**ప్రశ్న:** ఇటీవల మీదృష్టికి వచ్చిన కొత్త తరహాకేసు ?

**జవాబు:** ఇటీవల చీరాల వన్‌టౌన్ పరిధిలో ఓ రిటైర్డ్ ఉద్యోగికి ముంబాయి పోలీసులమంటూ, డిజిటల్ అరెస్ట్ అంటూ వీడియో కాల్‌తో కూడిన ఫోన్ వచ్చింది. అయితే బాధితుడు చాకచక్యంగా వ్యవహరించి వెంటనే వన్‌టౌన్ సీఐ శ్రీనివాసరావును ఆశ్రయించాడు. దీంతో వీడియో కాల్ మాట్లాడిన వన్‌టౌన్ సిఐ ఒక సందర్భంలో ఆయన సైతం అవాక్కు చెందారు. ఎట్టకేలకు ఆగంతక పోలీసులను గట్టిగా వివరాలు అడగడంతో వారు ఫోన్ కట్ చేసి జంప్ చేశారు. సెల్‌ఫోన్ వినియోగదారులు వీటిపై అప్రమత్తంగా ఉండండి.

**ప్రశ్న:** పేరాల్లో చోటుచేసుకున్న సైబర్ క్రైమ్ కేసు వివరాలు ఏమిటి ?

**జవాబు :** పేరాల్లో ఓ మహిళకు జనని సురక్షపథకం నుంచి అంటూ ఫోన్‌చేసి బ్యాంకు ఖాతాలోని సుమారు రూ.1,50లక్షలు అపహరించారు. దీంతో ప్రతిష్ఠాత్మకంగా దృష్టి సారించిన జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో డిల్లీకు చెందిన వారిని అరెస్ట్ చేశాం.

## బొబ్బేపల్లి గ్రావెల్ కొండపై మంటలు

- ఆర్పివేసిన ఫారెస్ట్ అధికారులు

మార్టూరు,మార్చి7(ఆంధ్రజ్యోతి):మండలంలోని బొబ్బేపల్లి ఫారెస్ట్ గ్రావెల్ కొండపై గురువారం రాత్రి చెలరేగిన మంటలను శుక్రవారం ఫారెస్ట్ అధికారులు ఆర్పివేశారు. వాస్తవంగా గురువారం రాత్రి మంటలు కొద్దిగా ఆగిపోయినా శుక్రవారం కూకట్లపల్లి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రమేష్ బాబు శుక్రవారం మంటలు రేగిన కొండప్రాంతాన్ని పరిశీలించారు. ఇంకా అక్కడ కృడా కొంచెం ఉన్న నిప్పురవ్వలను సిబ్బందిచేత ఆర్పివేయించారు. కొండపైన పశుకాపరులు చేసిన పొరబాటు కారణంగా చెట్ల ఆకులకు మంటలు వ్యాపించి ఉంటాయని బావిస్తున్నామని రమేష్ బాబు తెలిపారు. అదేవిధంగా ఫారెస్ట్ కొండ ప్రాంతం సమీపంలో పొలాలు సాగుచేసుకుంటున్న రైతులతో కూడా ఆయన మాట్లాడారు. ఎవరైనా కావాలనే కొండపైన మంటలు పెట్టినట్లయితే వారి సమాచారం అటవీ అధికారులకు తెలియచేయాలన్నారు. ఇంకా కొండపై మరింతగా నిఘా పెడతామన్నారు. అటవీ ప్రాంతంలో ఉన్న చెట్లుచేమలను జాగ్రత్తగా చూసుకోవలసిన బాధ్యత ఉందన్నారు.గ్రామస్థులను కూడా చైతన్యపరచి కొండ ప్రాంతాన్ని పరిరక్షించుకుంటామన్నారు.

## నేడు ఉచిత మెగా కంటి వైద్యశిబిరం

ఇంకొల్లు,మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఇంకొల్లులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ నెల 8వ తేదీ శనివారం ఉచిత మెగా కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 8 గంటలకు శిబిరం ప్రారంభమై మధ్యాహ్నం 2 గంటల వరకు వైద్య సేవలు అందించనున్నట్లు వారు తెలిపారు. ఇంకొల్లు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు నాయుడు హనుమంతరావు కోరారు.

## క్షయవ్యాధిపై అవగాహన

మార్టూరు,మార్చి7(ఆంధ్రజ్యోతి):మార్టూరు గ్రామ పంచాయతీలో పనిచేసే పారిశుధ్య కార్మికులకు శుక్రవారం క్షయవ్యాధిపై ప్రభుత్వ అస్పత్రిలోని టీబీ యూనిట్ అధికారులు, సిబ్బంది అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. క్షయవ్యాధికి గురైన వారి లక్షణాలను వివరించారు. వ్యాధి సోకిన వారు సక్రమంగా మందులను వినియోగించినట్లయితే త్వరగా కోలుకోవచ్చునన్నారు.ఈ కార్యక్రమంలో అధికారులు రాజశేఖర్‌బాబు, ఎ వెంకటేశ్వర్లు, ఏఎన్‌యంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మోసగించిన యువకుడిపై పోక్సో కేసు

అద్దంకి, మార్చి7(ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకుంటానని మైనర్ బాలికను నమ్మించి మోసగించిన యువకుడిపై శుక్రవారం అద్దంకి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. పోలీస్ ల కథనం మేరకు అద్దంకి మండలంలోని గోపాలపురంకు చెందిన బాలికను అదే గ్రామానికి చెందిన యువకుడు ప్రేమించాడు. పెళ్లి చేసుకుంటానని మోసగించాడు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు.